RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

పెట్టుబడులు తీసుకురావాలి

పరిశ్రమల శాఖ అధికారులతో సిఎస్ సమీక్ష

2

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 110 | మే 12 మంగళవారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 110 | May 12 Tuesay 2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |

## కేంద్రంతో సమయన్వయం ఆవశ్యకత



### సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో చిట్ చాట్

**హైదరాబాద్ జనసంఘర్షణ**
రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకోవడం అత్యంత ఆవశ్యకమని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీడియా సోమవారం చిట్‌చాట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీతో తన భేటీ కేవలం అభివృద్ధికి సంబంధించినదేనని, తెలంగాణ ప్రయోజనాల కోసం కేంద్రం సహకారం తప్పనిసరని ఆయన వివరించారు. తాను బీజేపీని రాజకీయంగా ఓడించి ముఖ్యమంత్రి అయినప్పటికీ, రాష్ట్ర హక్కుల సాధన కోసం కేంద్రంతో పోరాడుతూనే అభివృద్ధిలో కలిసి నడుస్తానని స్పష్టం చేశారు. గత పదేళ్లలో మునుపటి ప్రభుత్వం కేంద్రం నుంచి నిధులు రాబట్టడంలో విఫలమైందని, తాము మాత్రం వికసిత్ భారత్ మరియు 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యాలకు అనుగుణంగా 2034 నాటికి తెలంగాణను వన్ ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మార్చే దిశగా ప్రధాని సహకారం కోరామని తెలిపారు. రాజకీయ అంశాలపై స్పందిస్తూ బీజేపీని 'బ్రిటిష్ జనతా

➢ మిగతా 2వ పేజిలో..

## సర్ ప్రక్రియపై సమీక్ష




**హైదరాబాద్ జనసంఘర్షణ**
భారత ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియపై తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి సోమవారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్‌లోని సీఈఓ కార్యాలయం నుండి జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడిన ఆయన, ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను మరింత పకడ్బందీగా, వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ నెలాఖరు నాటికి కనీసం 90 శాతం పురోగతి సాధించడమే లక్ష్యంగా పనిచేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ మ్యాపింగ్ ప్రక్రియలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేందుకు

➢ మిగతా 2వ పేజిలో..

## బార్డర్ ఫెన్సింగ్‌పై తొలిసంతకం

**కలకత్తా జనసంఘర్షణ**
పశ్చిమ బెంగాల్‌లో నూతనంగా కొలువుదీరిన సువేందు అధికారి ప్రభుత్వం తన తొలి మంత్రివర్గ సమావేశంలోనే అనేక సంచలన నిర్ణయాలకు ఆమోదముద్ర వేసింది. ముఖ్యంగా భారత్-బంగ్లాదేశ్ సరిహద్దుల్లో అక్రమ చొరబాట్లను అరికట్టేందుకు వీలుగా కంచె నిర్మాణానికి అవసరమైన భూమిని బీఎస్‌ఎఫ్‌కు బదిలీ చేస్తూ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఈ ప్రక్రియను మరో 45 రోజుల్లోగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ముఖ్యమంత్రి స్వయంగా వెల్లడించారు. భద్రతా పరమైన అంశాలతో పాటు సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, జూన్ 1వ తేదీ నుండి రాష్ట్రంలోని మహిళలందరికీ ప్రభుత్వ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించనున్నట్లు ప్రకటించారు. ఇది విద్యార్థినులు, ఉద్యోగినుల ఆర్థిక భారాన్ని గణనీయంగా

➢ మిగతా 2వ పేజిలో..

## ప్రధాని ప్రస్తంగంపై నిప్పులు

### తన జవాబుదారీతనాన్ని పూర్తిగా విస్మరించారు.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ




**న్యూఢిల్లీ జనసంఘర్షణ**
ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిప్పులు చెరిగారు. ప్రధాని తన జవాబుదారీతనాన్ని పూర్తిగా విస్మరించారని, బాధ్యతల నుండి తప్పించుకు తిరుగుతున్నారని మండిపడ్డారు. ప్రజలు ఏ వస్తువులు కొనాలో, వేటిని వాడకూడదో నిర్దేశించే స్థాయికి ప్రధాని దిగజారడం దేశ దుస్థితికి అద్దం పడుతోందని ధ్వజమెత్తారు. తెలంగాణ సభలో మోదీ చేసిన వ్యాఖ్యలు ప్రబోధాల్లా లేవని, అవి కేంద్ర ప్రభుత్వ చేతకానితనానికి నిదర్శనాలని రాహుల్ విమర్శించారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ వేదికగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. అంతర్జాతీయ పరిస్థితులు, ముఖ్యంగా పశ్చిమాసియా యుద్ధం కారణంగా దేశంపై ఆర్థిక భారం పడుతోందని పేర్కొన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు ప్రపంచవ్యాప్తంగా

➢ మిగతా 2వ పేజిలో..

## స్టాలిన్‌ను కలిసిన తమిళనాడు సీఎం విజయ్

**చెన్నై జనసంఘర్షణ**
తమిళనాడు నూతన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన విజయ్, తన నిరాడంబరతతో మరియు రాజకీయ పరిణతితో అందరినీ ఆకట్టుకుంటున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం ఆయన మర్యాదపూర్వకంగా మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎం.కె. స్టాలిన్‌ను ఆయన నివాసంలో కలుసుకున్నారు. ఈ భేటీలో మాజీ ఉపముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ కూడా పాల్గొన్నారు. గతంలో ఎన్నికల ప్రచార సమయంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ఇరు పార్టీల మధ్య తీవ్రస్థాయిలో విమర్శలు ప్రతివిమర్శలు జరిగినప్పటికీ, పాలనాపరమైన అంశాల్లో సమన్వయం కోసం విజయ్ ఈ చొరవ తీసుకోవడం గమనార్హం. మరోవైపు, సోమవారం అసెంబ్లీలో నూతన ఎమ్మెల్యేల

➢ మిగతా 2వ పేజిలో..

## పోలవరం జూన్ నాటికి పూర్తి

### జాతికి అంకితం చేసి ప్రధాని నరేంద్రమోడీ చేతుల మీదుగా ప్రారంభం



**న్యూఢిల్లీ జనసంఘర్షణ**
ఆంధ్రప్రదేశ్ జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును 2027 జూన్ నాటికి పూర్తి చేసి, ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా జాతికి అంకితం చేయనున్నట్లు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రకటించారు. ఢిల్లీలో కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జరిపిన కీలక భేటీ అనంతరం మంత్రి నిమ్మల మీడియాతో మాట్లాడారు.

➢ మిగతా 2వ పేజిలో..

## బంగాళాఖాతంలో అల్పపీడనం

### పలు జిల్లాల్లో రాబోయే 48 గంటల్లో వర్షాలు



**విశాఖపట్నం జనసంఘర్షణ**
నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో రాబోయే 48 గంటల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ హెచ్చరించారు. ఉత్తర శ్రీలంక తీరానికి ఆనుకుని ఉన్న ఈ అల్పపీడనం మరింత బలపడనుందని, దీని కారణంగా మంగళవారం శ్రీకాకుళం నుంచి తిరుపతి వరకు విస్తరించి ఉన్న తీరప్రాంత జిల్లాలతో పాటు రాయలసీమలోనూ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. ముఖ్యంగా ఉరుములు, మెరుపుల సమయంలో ప్రజలు, రైతులు, పశుకాపరులు అప్రమత్తంగా ఉండాలని, బహిరంగ ప్రదేశాల్లో గానీ, చెట్ల కింద గానీ ఆశ్రయం పొందవద్దని సూచించారు. ఉరుముల శబ్దం వినిపించగానే సురక్షితమైన భవనాల్లోకి వెళ్లడం ఉత్తమమని, పాత భవనాలు లేదా భారీ హోర్డింగ్‌ల సమీపంలో ఉండటం ప్రమాదకరమని అధికారులు స్పష్టం చేశారు.

➢ మిగతా 2వ పేజిలో..

# కేంద్రంతో సమయన్వయం ఆవశ్యకత

**మొదటిపేజీ తరువాయి..** పార్టీ'గా రేవంత్ రెడ్డి అభివర్ణించారు. విభజించి పాలించడం ఆ పార్టీ నైజమని, దేశంలో భిన్నత్వానికి వారు ముప్పుగా మారుతున్నారని ఆరోపించారు. కేంద్రం విదేశీ విధానాల్లో విఫలమైందని, అనుభవరాహిత్యం మరియు అహంకారంతో దేశాన్ని సంక్షోభంలోకి నెడుతోందని విమర్శించారు. ఎన్నికల సమయంలో బీజేపీ తీరు 'జెమిని సర్కస్'లా ఉంటుందని ఎద్దేవా చేస్తూ, రాజ్యాంగ సంస్థలను ఆయుధాలుగా వాడుకుంటున్నారని మండిపడ్డారు. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లో బీజేపీకి ఆదరణ లేదని, కేరళ, తమిళనాడు ఫలితాలే అందుకు నిదర్శనమని పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్ల అమలుకు 2011 జనాభా లెక్కలే ప్రాతిపదిక కావాలని, నియోజకవర్గాల పునర్విభజన సాకుతో దానిని వాయిదా వేయకూడదని సూచించారు.

రాష్ట్రానికి సంబంధించిన ప్రాజెక్టుల విషయంలో రీజినల్ రింగ్ రోడ్, మెట్రో విస్తరణ, మూసీ పునరుజ్జీవనం వంటి అంశాల్లో కేంద్ర క్లియరెన్స్‌లు, నిధుల అవసరాన్ని ప్రధానికి వివరించినట్లు చెప్పారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టు సమస్య పరిష్కారానికి మహారాష్ట్ర ప్రభుత్వంతో ప్రధాని మధ్యవర్తిత్వం వహించాలని కోరారు. ఇక శాంతిభద్రతల విషయంలో తెలంగాణలో భారీ సంఖ్యలో మావోయిస్టులు లొంగిపోవడాన్ని ప్రస్తావిస్తూ, బుల్లెట్ కన్నా బ్యాలెట్ గొప్పదని కాంగ్రెస్ నిరూపించిందన్నారు. చట్టం ముందు అందరూ సమానమేనని చెబుతూ, బండి సంజయ్ కుమారుడిపై కేసు విచారణలో ఎవరికీ మినహాయింపు ఉండదని స్పష్టం చేశారు. అదే సమయంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ వంటి నేతల విమర్శలను తిప్పికొడుతూ, ఆధారాలు ఉంటే పోలీసులకు ఇవ్వాలని, మైకుల ముందు మాట్లాడితే విచారణ జరగదని హితవు పలికారు. రైతుల సంక్షేమం కోసం తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు.

# ప్రధాని ప్రస్తంగంపై నిప్పులు

**మొదటిపేజీ తరువాయి..** పెరిగినప్పటికీ, ఆ భారాన్ని కేంద్రమే భరిస్తోందని చెప్పారు. ఈ క్రమంలోనే ప్రజలు ఇంధన వినియోగాన్ని తగ్గించుకోవాలని, ఎలక్ట్రిక్ వాహనాలను వాడాలని, వీలైనంత వరకు వర్క్ ఫ్రమ్ హోమ్ లేదా ఆన్‌లైన్ మీటింగ్‌లకే పరిమితం కావాలని సూచించారు. ఈ సూచనలపై రాహుల్ గాంధీ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా తీవ్రంగా స్పందించారు. సమస్యలు వచ్చిన ప్రతిసారీ బాధ్యతను ప్రజల మీదికి నెట్టేయడం మోదీకి అలవాటుగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. యుద్ధం సాకుతో తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవాలని చూడటం సరికాదని, ఇలాంటి ధోరణి ఉన్నవారు దేశాన్ని నడపడం కష్టమని వ్యాఖ్యానించారు. క్లిష్ట పరిస్థితుల్లో ప్రజలను ఆదుకోవాల్సింది పోయి, వారిపైనే ఆంక్షలు విధించేలా మాట్లాడటం ప్రధాని అహంకారానికి చిహ్నమని రాహుల్ దుయ్యబట్టారు. మోదీ పాలనలో దేశం ఆర్థికంగా వెనుకబడటానికి ఇటువంటి బాధ్యతారహితమైన వైఖరే కారణమని ఆయన విమర్శించారు.

# బంగాళాఖాతంలో అల్పపీడనం

**మొదటిపేజీ తరువాయి..** తగ్గిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. ఆరోగ్య రంగంలో కూడా మార్పులు చేస్తూ, గతంలో నిలిచిపోయిన కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకం 'ఆయుష్మాన్ భారత్'ను రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని నిర్ణయించారు. దీనితో పాటు నిరుద్యోగ యువతకు ఊరటనిస్తూ పాఠశాల విద్యాశాఖలో ఉద్యోగాల భర్తీకి సంబంధించి గరిష్ట వయో పరిమితిని ఐదేళ్ల పాటు పెంచుతూ కేబినెట్ తీర్మానించింది. మహిళలకు ఆర్థిక చేయూతనిచ్చే 'అన్నపూర్ణ భండార్' వంటి పథకాల ద్వారా నెలకు మూడు వేల రూపాయల సాయం అందించేలా చర్యలు చేపడుతున్నారు. కేంద్రం గతంలో జారీ చేసిన 2025 జనగణన సర్క్యులర్‌ను తక్షణమే అమలు చేయాలని అధికారులను ఆదేశించిన ప్రభుత్వం, కేంద్ర పథకాలను రాష్ట్ర ప్రజలకు పూర్తిస్థాయిలో చేరువ చేస్తామని స్పష్టం చేసింది. ఈ నిర్ణయాలన్నీ రాష్ట్ర అభివృద్ధిలో కొత్త అధ్యాయానికి నాంది పలుకుతాయని ముఖ్యమంత్రి ధీమా వ్యక్తం చేశారు.

# స్టాలిన్‌ను కలిసిన తమిళనాడు సీఎం విజయ్

**మొదటిపేజీ తరువాయి..** ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా జరిగింది. ముఖ్యమంత్రిగా విజయ్ ముందుగా ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో ఒక ఆసక్తికర సంఘటన చోటుచేసుకుంది; మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కీర్తన తన ఎలక్షన్ సర్టిఫికేట్ మర్చిపోవడంతో మొదట ప్రమాణం చేయలేకపోయారు, ఆ తర్వాత సర్టిఫికేట్ సమర్పించి ఎమ్మెల్యేగా ప్రమాణం పూర్తి చేశారు. మే 13న విజయ్ ప్రభుత్వం అసెంబ్లీలో బలపరీక్షను ఎదుర్కోనుంది.

రాజకీయాలకు అతీతంగా విజయ్ ప్రదర్శిస్తున్న నిరాడంబరత ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఎండీఎంకే అధినేత వైకో నివాసానికి వెళ్లిన ఆయన, వైకో కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా గడపడమే కాకుండా, అక్కడ పనిచేసే సిబ్బందిని స్వయంగా పలకరించి వారితో ఫోటోలు దిగడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ముఖ్యంగా వైకో రాజకీయ అనుభవాన్ని, ఆయన ప్రసంగాలను విజయ్ ప్రశంసించడం విశేషం. తన తొలి రాజకీయ ప్రసంగం కంటే ముందు వైకో ఉపన్యాసాలను స్ఫూర్తిగా తీసుకున్నానని విజయ్ స్వయంగా వెల్లడించారు. సామాన్యుల పట్ల ఆయన చూపిస్తున్న ఆప్యాయత, రాజకీయ దిగ్గజాల పట్ల ఆయన కనబరుస్తున్న గౌరవం చూసి నెటిజన్లు విజయ్‌ను ఒక ఆదర్శవంతమైన నాయకుడిగా కొనియాడుతున్నారు.

# సర్ ప్రక్రియపై సమీక్ష

**మొదటిపేజీ తరువాయి..** గేటెడ్ కమ్యూనిటీలు, రెసిడెన్షియల్ అసోసియేషన్లు మరియు స్లమ్ ఏరియా ప్రతినిధులను సమన్వయం చేసుకోవాలని సీఈఓ సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులందరూ స్వచ్ఛందంగా తమ సంబంధిత బీఎల్‌ఓలను (దీూా) సంప్రదించి మ్యాపింగ్ చేయించుకోవాలని కోరారు. ఓటర్లకు ఇబ్బంది కలగకుండా సూపర్వైజర్ స్థాయి అధికారులతో హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేయాలని, స్వయం సహాయక సంఘాలు మరియు రేషన్ షాపు డీలర్లను కూడా ఈ ప్రక్రియలో భాగస్వాములను చేయాలని ఆదేశించారు.

ముఖ్యంగా ఓటరు జాబితా ప్రక్షాళనపై దృష్టి సారించిన సీఈఓ, మరణించిన వారు, వలస వెళ్లిన వారు మరియు శాశ్వతంగా చిరునామా మార్చుకున్న ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి తొలగించాలని స్పష్టం చేశారు. అలాగే ూాఙణ (దివ్యాంగులు) మరియు 85 ఏళ్లు పైబడిన ఓటర్ల మ్యాపింగ్‌ను కూడా ప్రాధాన్యత క్రమంలో చేపట్టాలని సూచించారు. రాజకీయ పార్టీల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకునేందుకు ప్రతి బుధవారం వారితో సమావేశాలు నిర్వహించాలని కలెక్టర్లకు సూచించారు.

సమాచార భద్రత విషయంలో ఆయన కఠిన హెచ్చరికలు జారీ చేశారు. ఎన్నికల సంబంధిత డేటాను అనధికార వ్యక్తులతో పంచుకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పొరపాట్లు జరిగిన చోట మ్యాపింగ్‌ను తక్షణమే సరిచేయాలని, జిల్లా స్థాయిల్లో మీడియా ద్వారా విస్తృత ప్రచారం కల్పించి ఓటర్లలో అవగాహన పెంచాలని కోరారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు సీఈఓ డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డితో పాటు ఇతర నోడల్ అధికారులు, సాంకేతిక సిబ్బంది పాల్గొన్నారు.

# బంగాళాఖాతంలో అల్పపీడనం

**మొదటిపేజీ తరువాయి..** ఒకవైపు వర్ష సూచన ఉన్నప్పటికీ, రాష్ట్రంలోని మరికొన్ని ప్రాంతాల్లో తీవ్రమైన ఉష్ణోగ్రతలు మరియు వడగాలులు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలోని చింతూరు, కూనవరం వంటి మండలాలతో పాటు పోలవరం పరిసర ప్రాంతాల్లో హీట్ అలర్ట్ అమల్లో ఉంది. విజయవాడ తూర్పులో అత్యధికంగా 42.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, కుక్కునూరు, మంత్రాలయం, కడప, తాడేపల్లి వంటి ప్రాంతాల్లో కూడా 41 డిగ్రీల కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ పరిస్థితుల్లో మధ్యాహ్నం సమయంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, తగినంత నీరు తాగుతూ ఎండ దెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. రైతులు తమ వ్యవసాయ పనులను ఉదయం లేదా సాయంత్రం వేళల్లోనే పూర్తి చేసుకోవాలని, పశువులను సురక్షిత ప్రాంతాల్లో ఉంచాలని సూచించారు.

## రాష్ట్రంలో పెట్టుబడుల ఆకర్శణకు కృషి

**పెట్టుబడులకు పారిశ్రామికవేత్తలు ఆస్తకి**

**పరిశ్రమల శాఖ అధికారులతో సిఎస్ సమిక్ష**

**హైదరాబాద్, మే 11 :**

తెలంగాణ రైజింగ్ -2047 విజన్ లో భాగంగా రాష్ట్రంలో భారీ పెట్టుబడులను ఆకర్షించడానికి పరిశ్రమలశాఖ అధికారులు కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు తెలిపారు. గౌరవ ముఖ్యమంత్రి. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు పరిశ్రమలశాఖ అధికారులతో, ప్రాజెక్ట్ కన్‌స్టలెంట్లతో సోమవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో పరిశ్రమలశాఖపై ఆయన సమీక్షించారు. తెలంగాణ రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెట్టడానికి వివిధ రాష్ట్రాల పారిశ్రామికవేత్తలు ఆస్తకి చూపుతున్నారని, ఆ దిశలో పరిశ్రమలశాఖ అధికార యంత్రాంగం సమాయత్తం కావాల్సిన అవసరం ఉందని, తగు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకొని పారిశ్రామికవేత్తలతో సమన్వయం చేసుకోవాలని ఆయన సూచించారు. ఎం.ఒ.యు.లతోపాటు పెట్టుబడి దారులకు అవసరమైన ఇతర మౌలిక వసతులను సమకూర్చాలన్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి పథకాలతోపాటు ఆయా రంగాలలో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను కూడా పెట్టుబడుదారులకు తెలియపరిచి రాష్ట్రాభివృద్ధికి తోడ్పాలని సిఎస్ తెలిపారు. భారీ పెట్టుబడులతో పాటు స్థానిక యువతకు అధిక స్థాయిలో ఉద్యోగావకాశాలు లభించే అవకాశాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, ఫార్మా రంగం, చేనేత ఉత్పత్తులు, టెక్స్ టైల్ పార్కులు, ఐటి పరిశ్రమలు, డేటా సెంటర్లు, డ్రైపోర్టులు సంబంధిత రంగాల్లో పారిశ్రామికవేత్తలు భారీగా పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి కనబరుస్తున్నారని, తెలంగాణ రైజింగ్ -2047 విజన్ కు వారు ఆకర్షితులవుతున్నందున అధికార యంత్రాంగం కూడా తగు కార్యాచరణ ప్రణాళికతో వారిని ప్రోత్సహించాలన్నారు. అమెజాన్, మైక్రోసాఫ్ట్, ఇన్ఫోసిస్ తదితర ఐటి సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకొస్తున్నారని అధికారులు తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగం, డెయిరీ ఉత్పత్తుల రంగంలో కూడా పెట్టుబడులు పెట్టడానికి పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపుతున్నారని అధికారులు పేర్కొన్నారు. రాష్ట్రంలో వివిధ రంగాలలో పెట్టుబడులతో పాటు యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు లభించే అవకాశాలు ఉన్నాయని అధికారులు అన్నారు. ఈ సమావేశంలో పరిశ్రమలశాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరించిన నాదెండ్ల

**గుంటూరు, మే11 :**

గుంటూరు జిల్లా తెనాలి మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా విజ్ఞప్తుల స్వీకరణలో 70 అర్జీలు వచ్చాయని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. సొమవారం ఆయన మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన పీజీ ఆర్ఎస్‌లో పాల్గొని అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. తెనాలి మున్సిపల్ పరిధిలోని తోపుడు బండ్లపై వ్యాపారం చేసుకునే వారి నుంచి ఆశీలు పేరిట జరిగే వసూళ్లను రద్దు చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ రోజు నుంచి అమలులోకి వస్తుందని తెలిపారు. అర్జీలు మున్సిపల్ 42, పోలీసు 11, రెవెన్యూ 11, ఇతరాలు 6 వచ్చినట్లు మంత్రి చెప్పారు.

# పొలవరం జూన్ నాటికి పూర్తి

**మొదటిపేజీ తరువాయి..** ఏపీని కరవు రహిత రాష్ట్రంగా మార్చడంలో పోలవరం అత్యంత కీలకమని, గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఈ ప్రాజెక్టు ప్రశ్నార్థకంగా మారిందని ఆయన విమర్శించారు. కేంద్ర జలశక్తి మంత్రి కూడా పీపీఏ, సీడబ్ల్యూసీ నిర్దేశించిన గడువు ప్రకారం 2027 నాటికి ప్రాజెక్ట్ పూర్తి చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారని వెల్లడించారు. తొలి దశలో 41.15 మీటర్ల ఎత్తు వరకు నీటిని నిల్వ చేసేందుకు అవసరమైన నిర్మాణాలు, పునరావాస (=ఁ=) పనుల కోసం కేంద్ర సహకారాన్ని ముఖ్యమంత్రి కోరినట్లు మంత్రి తెలిపారు. డయాఫ్రమ్ వాల్ నిర్మాణం ఇప్పటికే పూర్తి కావడంతో సివిల్ వర్క్‌ను వేగవంతం చేస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో తుంగభద్ర ప్రాజెక్టు గేట్ల నిర్వహణను పట్టించుకోలేదని, ఫలితంగా 19వ గేటు కొట్టుకుపోయిందని ఆరోపించిన ఆయన, కొత్త గేట్ల ప్రారంభోత్సవానికి కేంద్ర మంత్రిని ఆహ్వానించినట్లు పేర్కొన్నారు.

గోదావరి-కావేరి నదుల అనుసంధానం ద్వారానే నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని మంత్రి అభిప్రాయపడ్డారు. ప్రతి ఏటా గోదావరి నుంచి వృథాగా సముద్రంలో కలుస్తున్న సుమారు 3000 టీఎంసీల వరద నీటిని సమర్థవంతంగా వినియోగించుకోవడం వల్ల తెలుగు రాష్ట్రాలకు ఎంతో మేలు జరుగుతుందని వివరించారు. దీనికి సంబంధించి ప్రభుత్వం ఇప్పటికే కార్యాచరణ సిద్ధం చేస్తోందని, అలాగే భూగర్భ జలాలను పెంపొందించేందుకు విజయనగరంలో ప్రయోగాత్మకంగా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంపుపై సుప్రీంకోర్టు స్టే ఉన్న విషయాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లి, రాష్ట్ర అభ్యంతరాలపై చర్చించినట్లు నిమ్మల రామానాయుడు వెల్లడించారు.

## సికింద్రాబాద్ యువకుడి హత్యకేసు

**10మంది నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు**

**యువతితో ప్రేమాయణమే కారణమన్న డిసిపి**

**హైదరాబాద్, మే11 :**

సికింద్రాబాద్ చిలకలగూడ ప్రాంతంలో రెండు రోజుల క్రితం యావన్ అనే యువకుడు హత్యకు సంబంధించిన కేసులో పురోగతి సాధించారు. యావన్ తన స్నేహితులతో కలిసి చిలకలగూడలో ఓ ఇంట్లో క్రికెట్ మ్యాచ్ చూస్తున్న సమయంలో కొందరు వ్యక్తులు ఇంట్లోకి చొరబడి కత్తులతో దాడి చేశారు. తల, గొంతు, శరీరభాగాల్లో తీవ్రమైన కత్తిపోట్లు కావడంతో యావన్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. తాజాగా యావన్ హత్యకు సంబంధించిన వివరాలను సికింద్రాబాద్ జోన్ డీసీపీ రక్షితా మూర్తి వెల్లడించారు. ఈనెల 7వ తేదీన చిలకలగూడ పీఎస్ ప్రాంతంలో జరిగిన యావన్ హత్య కేసులో 10 మంది నిందితులను అరెస్ట్ చేశామని అన్నారు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టాం. కేసు విచారణ కోసం ఐదు బృందాలను ఏర్పాటు చేశాం. ఈ కేసులో సాయి కిరణ్ మొదటి నిందితుడు. అతడే యావన్ హత్యకు ప్లాన్ చేశాడు. అరెస్టైన వారిలో యువతి తండ్రి నరసింహ యాదవ్, బాబాయ్‌లు మల్లేష్ యాదవ్, శ్రీశైలం యాదవ్ ఉన్నారు. వీరితో పాటు అమ్మాయి బ్రదర్ పరమేష్ , అలానే ఓ మైనర్ కూడా ఉన్నాడు' అని డీసీపీ రక్షితా మూర్తి తెలిపారు. పక్కా ప్లాన్ చేసి.. యావన్‌ను హత్య చేశారు. హత్యకు నాలుగు రోజుల ముందు నుంచే యావన్‌ను చంపేందుకుప్లాన్ చేశారు. మేడిబావి ప్రాంతానికి వస్తే యావన్‌ను హత్య చేయడానికి ప్లాన్ చేసుకున్నారు. 7వ తేదీన యావన్ తన స్నేహితుడైన సుబ్బు ఇంటికి వచ్చాడు. అదే సమయంలో గ్యాంగ్ వచ్చి యావన్‌తో గొడవ పడ్డారు. ఆ సమయంలో ఒకరు కత్తితో యావన్‌ను పొడిచారు. అనంతరం మిగిలిన నిందితులు కూడా యావన్‌ను కత్తితో పొడిచారు. తీవ్రంగా గాయపడి యావన్‌ను స్నేహితులు గాంధీ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే చనిపోయినట్లు వైద్యులు చెప్పారు' అని డీసీపీ వెల్లడించారు. యావన్‌కు ఒక యువతితో స్కూల్ డేస్ నుంచి పరిచయం ఉంది. గత రెండేళ్లుగా ఇద్దరు ప్రేమలో ఉన్నారు. వారి ప్రేమ విషయం యువతి తల్లిదండ్రులకు నచ్చలేదు. దీంతో అతన్ని హెచ్చరించారు. అయినా యావన్ అలానే అమ్మాయితో ప్రేమ కొనసాగించాడు. నిందితుల నుంచి హత్యకు ఉపయోగించిన కత్తితో పాటు ద్విచక్ర వాహనం మొబైల్ ఫోన్లు సీజ్ చేశాం. నిందితులకు డ్రగ్స్ టెస్టులు నిర్వహించాం. అందులో రాహుల్, శివలకు గంజాయి పాజిటివ్ వచ్చింది' అని డీసీపీ రక్షితా మూర్తి తెలిపారు.

# న్యాయవాది నివాసంలో కనువిందు చేస్తున్న 'మే పుష్పం'

❑ **కట్టిపడేస్తున్న అపురూప దృశ్యం!**

ఇల్లందు మే 11 (జన సంఘర్షణ)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డులో సోమవారం ఒక అరుదైన దృశ్యం ఆవిష్కృతమైంది. ప్రముఖ న్యాయవాది దంతాల ఆనంద్ తన స్వగృహ ఆవరణలో పెంచుకుంటున్న మొక్కకు అపురూపమైన 'మే పుష్పం' వికసించింది. సాధారణంగా ఏడాదికి ఒక్కసారి మాత్రమే దర్శనమిచ్చే ఈ పుష్పం వికసించడంతో ఆ ప్రాంతమంతా సందడి నెలకొంది. పచ్చని ప్రకృతి మధ్య ఎర్రటి రంగులో ధగధగ మెరుస్తున్న ఈ పువ్వును చూసేందుకు స్థానికులు, ప్రకృతి ప్రేమికులు ఆసక్తిగా తరలివస్తున్నారు. ఈ పుష్పం చూసేందుకు ఎంతో ఆకర్షణీయంగా, గుండ్రంగా బంతి ఆకారంలో ఉంటుంది. అందుకే దీనిని 'ఫుట్‌బాల్ లిల్లీ' అని కూడా పిలుస్తుంటారు. ఈ మొక్క ఏడాది పొడవునా కేవలం ఆకులతో మాత్రమే ఉండి, సరిగ్గా మే నెలలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న తరుణంలో తన అందాలను వెదజల్లుతుంది. కేవలం కొన్ని రోజులు మాత్రమే వికసించి ఉండే ఈ పుష్పం, ఎర్రటి రంగులో సూర్యకిరణాల వెలుగులో మెరిసిపోతూ చూసేవారిని కట్టిపడేస్తోంది. న్యాయవాది ఆనంద్ నివాసంలోని తోటలో ఈ పుష్పం వికసించడం ఆ నివాసానికి కొత్త కళను తెచ్చిపెట్టింది. ప్రకృతి సిద్ధంగా ఈ 'మే ఫ్లవర్' వికసించడాన్ని వర్షాకాలం రాకకు సూచికగా భావిస్తారు. ఎండల తీవ్రత తగ్గుముఖం పట్టి, వరుణ దేవుడు పలకరించబోతున్నాడనే సంకేతాన్ని ఈ పువ్వు ఇస్తుందని పూర్వీకులు చెబుతుంటారు. అరుదుగా వికసించే ఈ అద్భుత పుష్పాన్ని చూసి న్యాయవాది ఆనంద్ కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని 19వ వార్డులో



వికసించిన ఈ మే పుష్పం ఇప్పుడు స్థానికంగా చర్చనీయాంశమైంది.

## అన్నవదినలపై, వారి కుమారులపై హత్యయత్నం చేసిన తమ్ముడికి అతని కుమారుడికి పదేళ్ల జైలు శిక్ష

❑ **కేసు పరిపక్వతలో మెలకువలు తీసుకువచ్చి నేరస్తులకు శిక్ష పడే దానికి కృషి చేసిన సిబ్బందిని అభినందించిన పోలీస్ కమిషనర్**

బోధన్: మే 11 జన సంఘర్షణ

అన్నవదినలపై , వారి ఇద్దరు కొడుకులపై హత్యయత్నం చేసిన నీరడి చిన్న గంగాధర్‌కు అతని కుమారుడు నీరడి దేవేందర్‌కు పది సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు పది వేల రూపాయల జరిమానా విధిస్తూ నిజామాబాద్ నాల్గవ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి దారావత్ దుర్గా ప్రసాద్ సోమవారం తీర్పు చెప్పారు. తీర్పులోని వివరాలు. నవీపేట్ మండలం బినోల గ్రామానికి చెందిన నీరడి గంగాధర్, నీరడి చిన్న గంగాధర్ అన్నదమ్ములు. వీరి తండ్రి హన్మాండ్లు ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ మరణించారు. తండ్రి మరణానంతరం చిన్న గంగాధర్ ఎలాగోలా గ్రామ రెవిన్యూ అధికారిగా ఉద్యోగం వారసత్వంగా సంపాదించుకున్నాడు. వారసత్వంగా వచ్చిన ఉమ్మడి ఆస్థి , ఉద్యోగం విషయంలో అన్న తమ్ముడి మధ్య పంచాయతీ ఉన్నది. కుల పెద్దల సమక్షంలో 25 జనవరి, 2025 న మౌఖిక రాజీ పరిష్కారం చేసుకున్నారు. జనవరి 28 తేదిన పెద్దల ముందు పేపర్స్ మీద వ్రాసుకుని ఒప్పందంపైన సంతకాలు చేసుకుందామని మాట్లాడుకున్నారు. ఒప్పందం విషయంలో తనకు కొన్ని అభ్యంతరాలు ఉన్నాయని అవి తనకు సమ్మతం కావని గొడవ చేసి చిన్న గంగాధర్ వెళ్ళిపోయాడు. ఆస్థి పంపకాలతో పాటు వారసత్వంగా వచ్చిన ఉద్యోగంను నష్ట పోవలసి వస్తుందనే కోపంతో , కక్షతో సాయంత్రం ఐదు గంటలకు చిన్న గంగాధర్ ఇనుప రాడ్ తో అన్న గంగాధర్ తలపై , కుడి బుజంపై కొట్టి తీవ్రంగా గాయపరచి హత్యయత్నం చేశారు. అడ్డుపడిన అతని భార్య లతను చిన్న గంగాధర్ కొడుకు దేవేందర్ రాడ్‌తో తలపై కొట్టి తీవ్రంగా గాయ పరచాడు. గంగాధర్ కుమారులైన ప్రసాద్, శ్రీకాంత్ లను చిన్న గంగాధర్ అతని కుమారుడు దేవేందర్ రాడ్‌తో కొట్టి హత్యయత్నం చేశారని, ఇద్దరు ముద్దాయిలైన చిన్న గంగాధర్, దేవేందర్‌ల ఉమ్మడి లక్ష్యం ఉన్నదనె నేర అభియోగాలు కోర్టు నేర న్యాయ విచారణలో రుజువు అయినట్లు జడ్జి దుర్గా ప్రసాద్ తమ తీర్పులో ధ్రువీకరించారు. భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 109 (1) హత్యయత్నంకు గాను పది సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు పది వేల రూపాయల జరిమానా విధించారు. ఇద్దరు ముద్దాయిల ఉమ్మడి లక్ష్యం ఉన్నదనే నేరం రుజువు అయినందున సెక్షన్ 3(5) ప్రకారం మరో పది సంవత్సరాల, పది వేల రూపాయల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి దుర్గా ప్రసాద్ తీర్పు చెప్పారు. శిక్షలన్ని ఏకకాలంలో అనుభవించాలని జడ్జి తమ తీర్పులో పేర్కొన్నారు. ఈ కేసులో నేరస్తులకు శిక్ష పడడానికి కృషి చేసిన ఎమ్. నీరజా (పబ్లిక్ ప్రాసిక్యూటర్), కే. వినయ్ ఎస్.ఐ నవిపేట్ పిఎస్ ( ప్రస్తుతం ధర్పల్లి పోలీస్ స్టేషన్), టి గోవింద్ కోర్టు లైసెన్ ఆఫీసర్, ఎం. రాజ్ కుమార్ (పిసి) కోడ్ డ్యూటీ ఆఫీసర్ కే చంద్రశేఖర్ (పీసీ) కే గణేష్( పీసీ) లను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య, ఐపీఎస్. అభినందించారు.

# ఇల్లందు మున్సిపాలిటీలో 'షాడో' పాలన

❑ **గెలిచిన కౌన్సిలర్ ఒకరు.. పెత్తనం చలాయించే వారు మరొకరు: ఇల్లందులో వింత పాలన**

❑ **క్షుద్ర పూజల ముసుగులో కక్షసాధింపులు.. ఇల్లందు రాజకీయం ఎటు వైపు?**

❑ **మున్సిపాలిటీనా లేక ముఠా కార్యాలయమా? ఇల్లందు రాజకీయ దుమారం వెనుక అసలు నిజాలివే!**

ఇల్లందు మే 11 (జన సంఘర్షణ)

**దొంగే దొంగ అన్నట్లు ఉంది సాంబమూర్తి తీరు:**

గతంలో సింగరేణి స్క్రాప్ కుంభకోణాల్లో ప్రధాన పాత్రధారిగా ఉండి, అధికారిక విచారణలు ఎదుర్కొన్న మడుగు సాంబమూర్తి వంటి వ్యక్తులు నేడు తనకు నీతులు చెప్పడం హాస్యాస్పదమని దండు సారయ్య తీవ్రంగా విమర్శించారు. "ఒక దొంగే వేరే వారిని దొంగ అనడం" సమాజాన్ని తప్పుదారి పట్టించడమేనని, తన రాజకీయ ఎదుగుదలను చూసి ఓర్వలేకనే ఇటువంటి దిగజారుడు విమర్శలకు దిగుతున్నారని ఆయన మండిపడ్డారు.

**క్షుద్ర రాజకీయాలతో ప్రజలను వంచించడం తగదు:**

ప్రజా సమస్యలపై పోరాడాల్సింది పోయి, 'క్షుద్ర పూజలు, లంకె బిందెలు' వంటి మూఢనమ్మకాలతో కూడిన ఆరోపణలు తనపై చేయడం సాంబమూర్తి అజ్ఞానానికి నిదర్శనమని సారయ్య ధ్వజమెత్తారు. ప్రజలు ఓట్లతో తిరస్కరించిన విషయాన్ని జీర్ణించుకోలేక, పాత కక్షలను మనసులో పెట్టుకుని ప్రజలను తప్పుదారి పట్టించేలా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

**సమాంతర పాలన ప్రజాస్వామ్యానికి విరుద్ధం:**

ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజలు ఎన్నుకున్న కౌన్సిలర్లను కాదని, అధికార పార్టీ పెద్దల అండతో మున్సిపాలిటీలో 'అనధికార చక్రం' తిప్పడం రాజ్యాంగ విలువల ఉల్లంఘనేనని సారయ్య ఆరోపించారు. ఎటువంటి అధికార హోదా లేని వ్యక్తులు మున్సిపల్ కార్యాలయంలో పెత్తనం చలాయించడం అంటే, ఓటు వేసిన ప్రజలను అవమానించడమేనని ఆయన ఘాటుగా విమర్శించారు.

**వార్డు అభివృద్ధిలో అక్రమ జోక్యం:**

13వ వార్డులో జరుగుతున్న అభివృద్ధి పనుల విషయంలో తనకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా, కౌన్సిలర్‌ను పక్కనబెట్టి పనులు చేయడంపై సారయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. పంపు కనెక్షన్లు, ట్యాంకర్ల పంపిణీ వంటి కనీస వసతుల విషయంలో కూడా సాంబమూర్తి కుటుంబం జోక్యం చేసుకుంటూ, తనను ప్రజల్లో పలచన చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆయన వెల్లడించారు.

**సంక్షేమ పథకాలకు అడ్డుతగులుతున్న వైనం:**

పేద ప్రజలకు అందాల్సిన ప్రభుత్వ పథకాలను రాజకీయ కారణాలతో అడ్డుకోవడం అత్యంత దుర్మార్గమని సారయ్య పేర్కొన్నారు. కో-ఆప్షన్ పదవిని అడ్డుపెట్టుకుని, సాంబమూర్తి కుటుంబం మున్సిపాలిటీని తమ సొంత జాగీరులా భావిస్తోందని, దీనివల్ల అర్హులైన పేదలు నష్టపోతున్నారని ఆయన ఆరోపించారు. ప్రజల సంక్షేమం కంటే స్వార్థ రాజకీయాలే వారికి



ముఖ్యమయ్యాయని విమర్శించారు.

**అధికారుల మౌనం.. అక్రమార్కులకు కొమ్ముకాయడమే:**

మున్సిపల్ అధికారులు రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు సహకరించాల్సింది పోయి, అనధికార వ్యక్తుల ఒత్తిళ్లకు తలొగ్గడం ఏంటని సారయ్య ప్రశ్నించారు. అక్రమాలను చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారుల తీరుపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. వ్యవస్థలో



జవాబుదారీతనం లేకపోవడం వల్లే ఇలాంటి వారు రెచ్చిపోతున్నారని దుయ్యబట్టారు.

**కలెక్టర్, ఎస్పీ గడప తొక్కిన న్యాయం:**

తనపై సాగుతున్న మానసిక వేధింపులు, తప్పుడు ప్రచారాలపై జిల్లా కలెక్టర్, ఎస్పీకి రాతపూర్వక ఫిర్యాదు చేసినట్లు సారయ్య తెలిపారు. అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న సాంబమూర్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని, తన వార్డులో అక్రమ జోక్యాన్ని అరికట్టాలని ఆయన విన్నవించారు. చట్టంపై తనకు నమ్మకం ఉందని, ఉన్నతాధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరుపుతారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

**ప్రజల కోర్టులో తేల్చుకుంటా.. పరువు నష్టం దావా వేస్తా:**

తన వ్యక్తిత్వానికి భంగం కలిగించినందుకు పరువు నష్టం దావా వేసేందుకు వెనకాడబోనని సారయ్య హెచ్చరించారు. రాజకీయ పబ్బం గడుపుకోవడం కోసం ఎవరిని పడితే వారిని విమర్శిస్తే చూస్తూ ఊరుకోనని, ప్రజలు అన్నీ గమనిస్తున్నారని ఆయన అన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలే వీరికి బుద్ధి చెబుతారని, అంతిమంగా ధర్మమే గెలుస్తుందని దండు సారయ్య స్పష్టం చేశారు.

## తడిసిన కన్ను.. వీడని దైన్యం: కొమరారం కేంద్రంగా సెగలు రేపుతున్న 'రైతు' ఆవేదన

కొమరారం మే 11 (జన సంఘర్షణ)




కొమరారం మొక్కజొన్న కొనుగోలు కేంద్రం వద్ద అఖిల భారత రైతుకూలి సంఘం ఆధ్వర్యంలో రైతులు చేపట్టిన ఆందోళన కేవలం ఒక నిరసన మాత్రమే కాదు, అది అన్నదాత ఆకలి కేక. ఆకాశం నుంచి కురిసిన అకాల వర్షాలకు సగం పంట తడిసి ముద్దయితే, ప్రభుత్వ నిబంధనల సాకుతో కొనుగోలు ప్రక్రియలో జరుగుతున్న జాప్యం మిగిలిన సగం పంటను నిలువునా దహిస్తోంది. క్షేత్రస్థాయిలో తేమ శాతం నెపంతో అధికారులు రైతులను ఇబ్బందులకు గురిచేస్తుండటంపై ఖమీా నాయకులు గళమెత్తారు. చెమటను పెట్టుబడిగా మార్చి పండించిన పంటను అమ్ముకోవడానికి కూడా రైతు నడిరోడ్డుపై బైఠాయించాల్సి రావడం మన వ్యవస్థలోని వైఫల్యానికి నిదర్శనం. 'అన్నం పెట్టే చేతులు.. అన్యాయంపై పిడికిలి ఎత్తాయి' అన్న సందేశం ఈ నిరసనలో స్పష్టంగా కనిపిస్తోంది. పాలకుల హామీలు కాగితాలకే పరిమితం కాకుండా, ప్రతి గింజా కొనుగోలు చేసే వరకు పోరాటం ఆగదని రైతాంగం హెచ్చరిస్తోంది. ప్రభుత్వం తక్షణమే స్పందించి నిబంధనలను సడలించకపోతే, ఈ సెగ రాజధానికి తాకడం ఖాయం.

## అకాల వర్షం వేళ.. రైతుకు భరోసాగా 'ముచ్చర్ల' గిడ్డంగి!

కామేపల్లి మే 11 (జన సంఘర్షణ)



ఆకాశం మేఘావృతమై అన్నదాత గుండెల్లో రైళ్లు పరిగెడుతున్న వేళ, చెమట చిందించి పండించిన మొక్కజొన్న పంటను కాపాడుకోవడమే లక్ష్యంగా యంత్రాంగం కదిలింది. ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆదేశాలతో ముచ్చర్ల గిడ్డంగిలో ప్రారంభమైన మొక్కజొన్న నిల్వ ప్రక్రియను మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కేవలం ఆదేశాలకే పరిమితం కాకుండా, గిడ్డంగిలో నిల్వ సామర్థ్యాన్ని, భద్రతా ప్రమాణాలను స్వయంగా తనిఖీ చేసిన ఆయన, రైతులు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. "ప్రకృతి కన్నెర్ర చేసినా, ప్రభుత్వ అండ ఉందనే నమ్మకాన్ని రైతులో నింపడమే మన ప్రథమ కర్తవ్యం" అంటూ అధికారులకు ఆయన దిశానిర్దేశం చేయడం గమనార్హం. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే అకాల వర్షాల ముప్పు నుంచి రైతాంగాన్ని ఎలా గట్టెక్కించవచ్చో ఈ తనిఖీ ఒక నిదర్శనంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ పుచ్చకాయల వీరభద్రంతో పాటు స్థానిక నేతలు పాల్గొని, నిల్వ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను కోరారు.

## బోధన్ ఆర్డిఓ బాధ్యతలు చేపట్టిన ఎం.విజయ కుమారి

బోధన్ మే 11: జన సంఘర్షణ



హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లయ్లో పనిచేస్తున్న ఎం.విజయ కుమారి బోధన్ ఆర్డీవోగా నియమితులయ్యారు. బోధన్ ఆర్డీవోగా సోమవారం ఉదయం 10 గంటలకు ఎం.విజయ కుమారి బోధన్ ఆర్డీవో కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు.అనంతరం ఆమె మాట్లాడుతూ... బోధన్ నీటి సమస్య తీవ్ర సమస్యలు ఉన్నాయని తెలుసుకున్న శాశ్వత పరిష్కారం చేపడతానన్నారు. బోధన్ పట్టణ వాసులకు నీటి కొరత లేకుండా చేపడతానని ఆమె తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే దృష్టికి తీసుకురావాలని ఆమె పేర్కొన్నారు.

## బోధన్ పట్టణంలో గంజాయి నేరస్థుని అరెస్ట్

బోధన్ మే 11 జన సంఘర్షణ




బోధన్ పట్టణంలోని పెంట బైపాస్ వద్ద సోమవారం మధ్యాహ్నం సుమారు 01:60 గంటల సమయం నమ్మదగిన సమాచారం మేరకు బోధన్ పోలీస్, ఈగల్ ఆర్ఎన్‌సీసీ టీం నిజామాబాద్ పూర్ణేశ్వర్ ఇన్స్పెక్టర్ సిబ్బందితో కలిసి పెంట బై పాస్ రోడ్ దగ్గర వాహనముల తనిఖి చేస్తుండగా నలుపు ఎరుపు రంగు పల్సర్ మోటార్ సైకిల్ టీఎస్ 16 ఎఫ్ఈ 4972 పై ముద్దాయి రాగా అతడిని పట్టుకొని తనిఖీ చేయగా అతని దగ్గర గంజాయి మొత్తం బరువు 1.660 ఒక కిలో ఆరు వందల అరవై గ్రాములు కలదు. వ్యక్తిని విచారించగా తన పేరు మేదరి మెట్ల ధనుష్, తండ్రి మేదరి మెట్ల సతీష్ కుమార్, వయసు 20 సం, కులం మున్నూరు కాపు, వృత్తి:కులీ పని, నివాసం అజమ్ గంజ్ బోధన్ ప్రస్తుత నివాసం ఆదర్శ నగర్ ఆర్మూర్ నిషేదిత గంజాయిని నాందేడ్ నుండి కొనుక్కొని వచ్చి ఇక్కడ యువకులకు, కూలి పని చేసే వారికి అముతున్నారు. అతడిని పట్టుకొని అతని వద్ద నుండి గంజాయి మరియు మోటార్ టీఎస్ 16 ఎఫ్ఈ 4972, సెల్ ఫోన్‌ని స్వాధీనం చేసుకున్నరు. హబీబ్ ఖాన్ ఎస్ , ఐపిఎస్ బోధన్ టౌన్ వి. వెంకట నారాయణ ఎస్‌హెచ్ఓ బోధన్ టౌన్, హబీబ్ ఖాన్ ఎస్సై బోధన్, సిబ్బంది కే. మహేష్, ఎ. వరుణ్‌లను, ఈగల్ ఆర్ఎన్, సిసి టీం నిజామాబాద్ పూర్ణేశ్వర్ ఇన్స్పెక్టర్ సిబ్బందిని కమిషనర్ అభినందించారు. బోధన్‌లో ఎవరైనా నిషేదిత గంజాయిని కొనడం, అమ్మడం లేదా సేవించడం వంటివి చేసే వారి పై చట్ట పరమైన చర్యలు తీసుకోనబడతాయి, మాదక ద్రవ్యాల నివారణకు ఉక్కుపాదం మోపబడును. ఎవరయినా గంజాయిని కొనడం, అమ్మడం లేదా సేవించడం వంటి చర్యలకు పాల్పడితే 1908 కి లేదా వాట్అప్ నెం 87126 71111 కి సమాచారము ఇవ్వగలరు. సమాచారము తెలిపిన వారి వివరములు గోప్యముగా ఉంచబడునని తెలిపారు.

జన సంఘర్షణ

మంగళవారం
12 మే 2026

# కేంద్ర మంత్రి పదవికి బండి సంజయ్ రాజీనామా చేయాలి

- **బాధితురాలికి హాని జరిగితే సీఎం, డీజీపీలదే బాధ్యత**
- **బండి సంజయ్ కొడుకుపై పోక్సో కేసు: కేంద్ర మంత్రిని బర్తరఫ్ చేయాల్సిందే - లావుడ్యా సత్యనారాయణ గర్జన**



కొత్తగూడెం మే 11 (జన సంఘర్షణ)
కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు సాయి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసుపై ప్రభుత్వం తక్షణమే స్పందించి, మంత్రిని పదవి నుంచి తొలగించాలని బిఆర్ఎస్ పార్టీ సుజాతనగర్ మండల అధ్యక్షులు లావుడ్యా సత్యనారాయణ నాయక్ డిమాండ్ చేశారు. ఒక మైనర్ బాలికపై అఘాయిత్యం జరిగినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మౌనంగా ఉండటం శోచనీయమని ఆయన సోమవారం మండిపడ్డారు.

**చట్టం ముందు అందరూ సమానులేనా?:**
రాజ్యాంగం కల్పించిన చట్టాలు సామాన్యుడికి ఒకలా, అధికారంలో ఉన్నవారికి మరోలా ఉండకూడదని లావుడ్యా సత్యనారాయణ గర్జించారు. కేంద్ర మంత్రి కుమారుడు ఒక మైనర్ అమ్మాయిపై అత్యాచారానికి పాల్పడి, పోక్సో కేసు నమోదైనప్పటికీ ఇప్పటికీ అరెస్టు చేయకపోవడం వెనుక ఉన్న మతలబు ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఇది బాధితురాలికి అన్యాయం చేయడమే కాకుండా, వ్యవస్థపై నమ్మకాన్ని సడలిస్తోందని విమర్శించారు.

**బీసీ కార్డు రాజకీయం - ఆ అమ్మాయి బీసీ బిడ్డ కాదా?:**
నిత్యం తాను 'బీసీ బిడ్డను' అని చెప్పుకుంటూ రాజకీయ లబ్ధి పొందే బండి సంజయ్, ఇప్పుడు తన కుమారుడి చేతిలో బలైపోయిన ఆ అమాయక బాలిక కూడా ఒక బీసీ బిడ్డే అన్న నిజాన్ని ఎందుకు విస్మరిస్తున్నారని సత్యనారాయణ నిలదీశారు. తన సొంత రాజకీయాల కోసం బీసీ ట్యాగ్‌ను వాడుకునే మంత్రికి, ఒక బీసీ బిడ్డకు జరిగిన అన్యాయం కనిపించడం లేదా అని ఘాటుగా వ్యాఖ్యానించారు.

**ప్రభుత్వాల మౌనం - నేరస్తులకు అండగా ఉండటమే:**
ఇంతటి గంభీరమైన నేరం జరిగినప్పుడు కేంద్ర ప్రభుత్వం గానీ, రాష్ట్ర ప్రభుత్వం గానీ స్పందించకపోవడాన్ని సత్యనారాయణ తీవ్రంగా తప్పుబట్టారు. బాధితురాలికి అండగా నిలవాల్సిన ప్రభుత్వాలు, నేరారోపణలు ఎదుర్కొంటున్న వారిని కాపాడాలని చూడటం ప్రజాస్వామ్యానికి సిగ్గుచేటన్నారు. తక్షణమే బండి సంజయ్‌ను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

**సీఎం, డీజీపీలకు హెచ్చరిక:**
తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి, డీజీపీలకు లావుడ్యా సత్యనారాయణ బిఆర్ఎస్ పార్టీ తరపున బలమైన హెచ్చరిక జారీ చేశారు. బాధితురాలి కుటుంబానికి భవిష్యత్తులో ఎటువంటి హాని జరిగినా దానికి రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తే చూస్తూ ఊరుకోబోమని స్పష్టం చేశారు.

**ప్రజా ఆగ్రహం తప్పదు:**
న్యాయం జరగకపోతే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా ఆగ్రహానికి గురికాక తప్పదని సత్యనారాయణ హెచ్చరించారు. బండి సంజయ్ కుమారుడిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించకపోతే, బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని ఆయన పిలుపునిచ్చారు. చట్టం తన పని తాను చేయాలని, బాధితురాలికి తక్షణమే న్యాయం చేకూరాలని డిమాండ్ చేశారు.

# ఎర్ర సముద్రాన్ని తలపించిన ఇల్లందు: కార్పొరేట్ పాలనపై రైతన్న 'సమర గర్జన'







ఇల్లందు మే 11 (జన సంఘర్షణ)
పాలక వర్గాల నయవంచనతో కునారిల్లుతున్న వ్యవసాయ రంగాన్ని రక్షించుకోవడానికి క్రియాశీల పోరాటాలే ఏకైక మార్గమని ఏఐయుకేఎస్ జాతీయ నాయకులు ప్రదీప్ సింగ్ ఠాగూర్ పిలుపునిచ్చారు. సోమవారం ఇల్లందులో జరిగిన ఏఐయుకేఎస్ జాతీయ ప్రథమ మహాసభల సందర్భంగా పట్టణం ఎర్రజెండాలతో రెపరెపలాడింది. ఫారెస్ట్ గ్రౌండ్ నుండి సింగరేణి పాఠశాల మైదానం వరకు వేలాది మంది రైతులు చేపట్టిన మహా ప్రదర్శన, అరుణోదయ కళాకారుల డప్పు వాయిద్యాలు, గొంగడి బృందాల నృత్యాల మధ్య ఒక ఎర్ర సముద్రాన్ని తలపించింది. పంటలకు కనీస మద్దతు ధర (సీ2+50శాతం) గ్యారెంటీ చట్టం చేయాలని, రైతుల రుణాలను మాఫీ చేయాలని నినదిస్తూ సాగిన ఈ ర్యాలీ పాలకుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించింది.

**కార్పొరేట్ సేవలో మోడీ.. వినాశనంలో వ్యవసాయం:**
బహిరంగ సభలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, జాతీయ కన్వీనర్ కెచ్చల రంగారెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. దేశానికి వెన్నెముక వంటి వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసి, అంబానీ, అదానీ వంటి కార్పొరేట్ శక్తులకు భూములను అప్పగించే కుట్ర జరుగుతోందని వారు ధ్వజమెత్తారు. అమెరికా షరతులకు లొంగి స్వదేశీ రైతుల ప్రయోజనాలను పణంగా పెట్టడం సిగ్గుచేటని, మతం పేరుతో యువతను మత్తులో ముంచి ఉపాధిని హరిస్తున్నారని మండిపడ్డారు. నల్ల చట్టాలకు వ్యతిరేకంగా సాగిన చారిత్రాత్మక పోరాట స్ఫూర్తితో మరోసారి కేంద్రంపై తిరగబడాల్సిన సమయం ఆసన్నమైందని వారు హెచ్చరించారు.

**కొత్త సీసాలో పాత సారా.. గ్యారెంటీలపై పోరు తప్పదు:**
రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి పాలనపై కూడా నాయకులు ఘాటు విమర్శలు చేశారు. "కొత్త సీసాలో పాత సారా" అన్న చందంగా తెలంగాణలో పాలన సాగుతోందని, ఆరు గ్యారెంటీల అమలు కోసం రైతాంగం పోరాటం చేయక తప్పదని స్పష్టం చేశారు. ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టును తక్షణమే పూర్తి చేసి జిల్లాకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. మొక్కజొన్న క్వింటాకు రూ. 2,400 మద్దతు ధర ఇచ్చి, తగినన్ని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోతే దళారీల చేతిలో రైతులు నిలువునా దోపిడీకి గురవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా వచ్చిన రైతు నాయకుల ఐక్యత చూస్తుంటే, భవిష్యత్తులో ఈ పోరాటం మరింత ఉధృతం కాబోతోందని స్పష్టమవుతోంది.

# బోధన్ నూతన ఆర్డిఓ విజయ కుమారి బాధ్యతల స్వీకరణ



బోధన్,/మే 11/(జనసంఘర్షణ)
రెవెన్యూ డివిజన్ కార్యా లయంలో కొత్తగా విజయ కుమారి ఆర్‌డీఓగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది ఆమెకు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. ప్రజలకు పారదర్శక పరిపాలన అందించడంతో పాటు సమస్యలనువేగంగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆమె తెలిపారు. కార్యాలయ సిబ్బంది సమన్వయంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తామని పేర్కొన్నారు.

# ప్రేమ వివాహం.. నవ దంపతులు ఆత్మహత్య



కొమురవెల్లి/మే 11/(జన సంఘర్షణ)
ప్రేమించి పెళ్లి చేసుకున్న నవ దంపతులు ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన సిద్దిపేట కొండపాకలో ఆదివారం చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన దండ్ల లహరి (21), కొమురవెల్లి గ్రామానికి చెందిన దేశెట్టి వినయ్ (23) పెద్దల అంగీకారంతో ఏప్రిల్ 9న ప్రేమ వివాహం చేసుకున్నారు. అయితే లహరి వేరొకరితో ఫోన్లో మాట్లాడుతోందన్న అనుమానంతో వినయ్ భార్యతో గొడవ పడ్డాడు. ఈ క్రమంలో మనస్తాపంతో లహరి ఆదివారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. భార్య మరణవార్త తెలిసి వినయ్ గజ్వేల్ కొడకండ్ల శివారులో చెట్టుకు ఉరివేసుకుని సూసైడ్ చేసుకున్నాడు.

# వేసవిలో సమ్మర్ క్యాంపును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

ఎల్లారెడ్డి, మే -11(జన సంఘర్షణ )







వేసవిలో సమ్మర్ క్యాంపును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ తోట గాంధీ అన్నారు. సోమవారం ఎల్లారెడ్డి మోడల్ స్కూల్లో సమ్మర్ క్యాంపెను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం వేసవిలో విద్యార్థులు బయట తిరగకుండా ఉండేందుకు గాను ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తుందని అన్నారు. క్యాంప్ లో భాగంగా విద్యార్థులకు యోగ ఇండోర్ గేమ్స్ తదితర కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతాయని అన్నారు. ఆసక్తిగల వారు ఉదయం 8 గంటలకు పాఠశాలకు చేరుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బలవంతరావు, విద్యారమణ, కృష్ణ, ప్రదీప్, గోపి మధు తదితరులు పాల్గొన్నారు.

# పోతంగల్ పాఠశాల యందు వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు

పోతంగల్/ మే 11/(జన సంఘర్షణ)



నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల కేంద్రంలోని సోమవారం మండల విద్యాధికారి, పొతంగల్ గ్రామ సర్పంచ్ సంధ్యా చేతుల మీదుగా ప్రారంభించడం జరిగినది. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఎల్ శంకర్ మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులకు ఈ శిక్షణ శిబిరం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఈ శిబిరంలో మ్యూజిక్, డాన్స్, కుట్లు అల్లికల యోగా ఇతర క్రీడలు నేర్పించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని మండలంలో ఉన్న ఆరు నుండి తొమ్మిదవ తరగతి చదివే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు వినియోగించుకోవాలని తెలపడం జరిగినది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయిలు, ఏఏపీసి చైర్మన్ అనురాధ, మాజీ ఎంపీపీ పవన్ కుమార్, మాజీ సర్పంచ్ గంట్ల విట్టల్, రిటైర్డ్ ప్రొఫెసర్ లక్ష్మణ్, గ్రామ పెద్దలు శంకర్, వార్డు సభ్యులు పంచ రెడ్డి అనిల్, ధనరాజు, రాజు, వివేకానంద యూత్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొనడం జరిగినది.


# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యా వారోత్సవాలు





ఎల్లారెడ్డి, మే -11(జన సంఘర్షణ )
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజా పాలనా ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 11వ తేదీ నుండి 17వ తేదీ వరకు విద్యా వారోత్సవాలను నిర్వహించనున్నట్లు ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇ. లక్ష్మి నారాయణ తెలిపారు. ఏడు రోజుల పాటు నిర్వహించే విద్యా వారోత్సవాల షెడ్యూల్ లో మొదటి రోజు విద్యా వారోత్సవాల ప్రారంభం, ఫౌండేషన్ స్టోన్ ఫర్ స్టేజి ఇన్ సెమినార్ హాల్, విద్యా వారోత్సవాల బ్రోచర్ విడుదల, అడ్మిషన్ బ్రోచర్ విడుదల, రెండవ రోజు పీజీ, బి. ఎడ్ పరీక్షలకు సిద్ధపడే విద్యార్థులకు, రెమెడియల్/ కోచింగ్ తరగతుల ప్రారంభం, యోగ కార్యక్రమం, మెడిటేషన్ ప్రోగ్రామ్స్, మూడవ రోజు కళాశాలలో చదివి ఉన్నత విద్యలో ఉన్న విద్యార్థులకు ఫైనల్ ఇయర్‌లో బాగా చదువుతున్న విద్యార్థులకు, కళాశాల ప్రిన్సిపాల్ అధ్యాపకులకు సత్కారం, నాలుగవ రోజు మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్, కళాశాలలో విద్యార్థుల అకాడమిక్ ఎదుగుదల మీటింగ్ ఏర్పాటు, ఐదవ రోజు బుక్స్ ఎగ్జిబిషన్, కళాశాల లైబ్రరీలో చదివే విద్యార్థులకు ప్రోత్సాహక బహుమాన కార్యక్రమం ఇ - లైబ్రరీ లాంచింగ్ కార్యక్రమం, ఆరవ రోజు జాతీయ సేవ పథకం కార్యక్రమాలు, లైబ్రరీ, స్పోర్ట్స్, సాంస్కృతిక కార్యక్రమాలు ఏడవ రోజు గ్రాండ్ వాలిడెక్టరీ ప్రోగ్రాం, ప్రైజ్ డిస్ట్రిబ్యూషన్ సాంస్కృతిక కార్యక్రమాలతో ముగింపు జరుగుతుంది అని కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ వారోత్సవాలలో విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొని విజయవంతం చేయాలనీ ఈ సందర్భంగా కోరారు.

# అన్న సాగర్ గ్రామంలో దొంగలు బీభత్సం

◆ తొమ్మిది ఇంళ్లలో చోరీ





ఎల్లారెడ్డి, మే -11(జన సంఘర్షణ )

మండలంలోని అన్నాసాగర్ గ్రామంలో ఆదివారం రాత్రి దొంగలు స్వైరవిహారం చేశారు. తాళం వేసి ఉన్న ఇళ్లనే టార్గెట్ చేసి 9 ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. అన్నాసాగర్‌కు గ్రామానికి చెందిన గంగాగౌడ్ ఇంట్లో 30 తులాల బంగారం, 28 తులాల వెండి, రూ.25 వేల నగదును దొంగలు అపహరించుకుపోయినట్లు బాధితులు కన్నీరు పెట్టుకున్నారు. మాదిగ శ్రీను, సాయిలు ఇళ్లలో రూ.10 వేల వరకు నగదు, కర్రె పోచయ్య ఇంట్లో 20 తులాల వెండి, అర తులం బంగారం చోరీకి గురయ్యాయి. కొనుగోళ్ల రాములు, జంగిడి సురేందర్ ఇళ్లలో దుస్తులు, ఇతర వస్తువులు, శ్రీనివాస్ గౌడ్ ఇంట్లో రూ.50 వేల నగదు, చీరలు ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. రామచందర్ రెడ్డి, మంద నాగిరెడ్డి ఇళ్లలో పోయిన వస్తువుల వివరాలు ఇంకా తెలియరాలేదు. మిగతా ఇళ్లలో రూ.ఐదు నుంచి రూ.పదివేల లోపు నగదు, పట్టుబట్టలను దుండగులు అపహరించుకు వెళ్లినట్లు పేర్కొన్నారు.విషయం తెలుసుకున్న పోలీసులు ఎల్లారెడ్డి ఇంచార్జ్ సీఐ సంతోష్ కుమార్, ఎస్ఐ రాజు, క్లూ టీం, క్రైమ్ బ్రాంచ్ పోలీసులతో దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. దొంగతానికి పాల్పడిన వారిని త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

# పొతంగల్ గ్రామ సర్పంచ్ సంధ్యా చేతుల మీదుగా వేసవి శిక్షణ శిబిరం ప్రారంభోత్సవం

పోతంగల్,మే11/(జన సంఘర్షణ)




ఈరోజు పాఠశాల యందు వేసవి శిక్షణ శిబిరాన్ని మండల విద్యాధికారి, పొతంగల్ గ్రామ సర్పంచ్ సంధ్యా చేతుల మీదుగా ప్రారంభించడం జరిగినది. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఎల్.శంకర్ మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులకు ఈ శిక్షణ శిబిరం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఈ శిబిరంలో మ్యూజిక్, డాన్స్, కుట్లు అల్లికలు, యోగా ఇతర క్రీడలు నేర్పించడం జరుగుతుందని ఈ అవకాశాన్ని మండలంలో ఉన్న ఆరు నుండి తొమ్మిదవ తరగతి చదివే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు వినియోగించుకోవాలని తెలపడం జరిగినది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయిలు, ఏఎంసీ చైర్మన్ అనురాధ, మాజీ ఎంపీపీ పవన్ కుమార్, మాజీ సర్పంచ్ గంట్ల విట్టల్, రిటైర్డ్ ప్రొఫెసర్ లక్ష్మణ్, గ్రామ పెద్దలు శంకర్, వార్డు సభ్యులు పంచ రెడ్డి అనిల్, ధనరాజు, రాజు, వివేకానంద యూత్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొనడం జరిగినది.

# భౌతిక దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్





నారాయణఖేడ్/మే 11/(జన సంఘర్షణ)

నారాయణఖేడ్ నియోజికవర్గం కంగ్టి మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు, పార్టీ వీరవిధేయుడు, మాజీ సర్పంచ్ నగ్నాథ్ మాస్టర్ అనారోగ్యంతో బాధపడుతూ తుదిశ్వాస విడిచారు. ఈ విషాద వార్త తెలుసుకున్న జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్, ఖేడ్ మున్సిపల్ చైర్మన్ నాగేష్ షెట్కార్ అక్కడికి చేరుకొని నగ్నాథ్ మాస్టర్ భౌతిక దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. వారితో పాటు నియోజికవర్గ నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఎంవీర్ డిగ్రీ కళాశాల విద్యార్థుల ఘనత

◆ 20 మందికి బ్యాంకు ఉద్యోగాలు

పలమనేరు, మే 11 (జన సంఘర్షణ) :

స్థానిక సాయి నగర్‌లోని ఎంవీర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉద్యోగ వేటలో సత్తా చాటారు. సోమవారం కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్స్‌లో మొత్తం 20 మంది విద్యార్థులు ప్రముఖ బ్యాంకుల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. బెంగళూరుకు చెందిన టీజీర్ ఇన్ఫోసోల్యూషన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎంపిక ప్రక్రియ ద్వారా విద్యార్థులు ఐసీఐసీఐ , ఆక్సిస్ బ్యాంకుల్లో కొలువులు సాధించారు. ఈ సందర్భంగా సంస్థ హెచ్.ఆర్ మేనేజర్ ఉమాశంకర్ మాట్లాడుతూ... ఎంపికైన విద్యార్థులకు వారి ప్రతిభను బట్టి ఏడాదికి రూ. 2.5 లక్షల నుండి రూ. 3.5 లక్షల వరకు వేతనం లభిస్తుందని వెల్లడించారు. ప్రముఖ బ్యాంకుల్లో ఉద్యోగాలు సాధించి కళాశాలకు పేరు తెచ్చిన విద్యార్థులను కరస్పాండెంట్ ఎంవీర్ రెడ్డి , ప్రిన్సిపాల్ లక్ష్మి సుధ ఎంవీర్ రెడ్డి, అధ్యాపక బృందం ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు.

# టీడీపీ బలోపేతమే లక్ష్యంగా ముద్రగడ వంశీ బృందం అడుగులు

◆ ఇల్లందు రాజకీయాల్లో నూతనోత్సాహం

హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ భవన్ వేదికగా సాగిన ఈ కలయిక కేవలం ఒక సన్మాన కార్యక్రమం మాత్రమే కాదు, తెలంగాణలో తెలుగుదేశం పార్టీ పునర్వైభవం కోసం క్షేత్రస్థాయిలో జరుగుతున్న నిశ్శబ్ద విప్లవానికి ఒక నిదర్శనం. ఇల్లందు నియోజకవర్గ మాజీ ఇంచార్జ్ ముద్రగడ వంశీ ఆధ్వర్యంలో, నూతనంగా ఎన్నికైన సర్పంచ్ చాందావత్ రమేష్ బాబుతో కలిసి పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు బక్కని నరసింహులును కలిసిన తీరు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. వరుసగా రెండోసారి పొలిట్ బ్యూరో సభ్యుడిగా బాధ్యతలు చేపట్టిన బక్కనిని శాలువాతో సత్కరించి, చిత్రపటాన్ని బహుమతిగా అందించడం వెనుక పార్టీ సీనియర్ల పట్ల యువ నాయకత్వానికి ఉన్న గౌరవం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ సందర్భంగా బక్కని నరసింహులు చేసిన వ్యాఖ్యలు పార్టీ శ్రేణుల్లో కొత్త ఆశలు చిగురింపజేశాయి. "తెలంగాణ గడ్డపై టీడీపీ ఒక బలమైన శక్తిగా ఎదగడమే కాకుండా, రాబోయే రోజుల్లో కింగ్ మేకర్ పాత్ర పోషిస్తుంది" అని ఆయన పేర్కొనడం, పార్టీ భవిష్యత్తుపై ఉన్న ధీమాను తెలియజేస్తోంది. ప్రస్తుతం పాత కమిటీలన్నీ రద్దయ్యాయని, చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు త్వరలోనే క్రియాశీలక కార్యకర్తలకు ప్రాధాన్యతనిస్తూ కొత్త కమిటీలను ప్రకటిస్తామని ఆయన స్పష్టం చేశారు. పదవుల కోసం కాకుండా, ప్రజాక్షేత్రంలో కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు లభిస్తుందని ఆయన ఇచ్చిన భరోసా కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపింది. ముఖ్యంగా ఇల్లందు రాజకీయాల్లో ముద్రగడ వంశీ పోషిస్తున్న పాత్రను బక్కని ప్రత్యేకంగా ప్రస్తావించారు. విజయలక్ష్మి నగర్ సర్పంచ్ గా చాందావత్ రమేష్ బాబును గెలిపించుకోవడంలో వంశీ వ్యూహరచన విజయవంతమైందని, విద్యార్థి దశ నుండి పోరాట పటిమ కలిగిన రమేష్ బాబు వంటి వారికి పార్టీ అండగా ఉంటుందని




కొనియాడారు. కేవలం ఎన్నికల సమయంలోనే కాకుండా, ఇల్లందులో ప్రత్యేకంగా పార్టీ ఆఫీసు ఏర్పాటు చేసి, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్న వంశీ పనితీరును రాష్ట్ర స్థాయి నేతలు గుర్తించడం గమనార్హం. మానుబితు అఖిల్ వంటి వార్డు సభ్యుల గెలుపు కూడా ఈ క్షేత్రస్థాయి కృషికే నిదర్శనం. రాజకీయాల్లో ఓటమి అనేది అంతం కాదని, అది ఒక గుణపాఠం మాత్రమేనని ఈ భేటీ గుర్తు చేసింది. గత మున్సిపల్ ఎన్నికల్లో స్వల్ప తేడాతో ఓటమి పాలైనప్పటికీ, నిరుత్సాహపడకుండా ముద్రగడ వంశీ సాగిస్తున్న పయనం ఇతర యువ నాయకులకు స్ఫూర్తిదాయకం. భవిష్యత్తులో మంచి అవకాశాలు



తలుపు తడతాయని, నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడాలని బక్కని ఇచ్చిన సూచనలు ఇల్లందు కేడర్‌కు దిశానిర్దేశం చేశాయి. అధికారం లేకపోయినా ప్రజల పక్షాన నిలబడటమే అసలైన రాజకీయమని ఈ సమావేశం చాటిచెప్పింది. ఈ కార్యక్రమం తెలంగాణ టీడీపీలో ఒక కొత్త తరహా నాయకత్వ మార్పును సూచిస్తోంది. సీనియర్ల అనుభవం, ముద్రగడ వంశీ వంటి యువ నేతల చొరవ కలిస్తే ఇల్లందులో పార్టీ పూర్వవైభవం సాధించడం కష్టమేమీ కాదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. బంటు వెంకటేశ్వర్లు, కార్ నరసన్న, పొదిలా శ్యామ్ వంటి నేతల సమక్షంలో జరిగిన ఈ భేటీ, రాబోయే ఎన్నికలకు ఇల్లందు టీడీపీ ఇప్పటి నుంచే సిద్ధమవుతోందనే సంకేతాలను స్పష్టంగా పంపింది. ప్రజాస్వామ్యంలో నిరంతర శ్రమకు ఫలితం తప్పకుండా ఉంటుందని నిరూపించడమే ఈ బృందం ముందున్న లక్ష్యం.

# ఇల్లందు 3వ వార్డు ప్రజల కష్టాలకు చైర్‌పర్సన్ స్వస్తి

◆ సమస్య ఏదైనా పరిష్కారం వెంటనే





ఇల్లందు మే 11 (జన సంఘర్షణ)

మున్సిపల్ చైర్‌పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ ఈరోజు ఎన్‌జీఓస్ కాలనీ వాగుపై ప్రజల రాకపోకల కోసం తాత్కాలిక రహదారిని ఏర్పాటు చేసి, తన హామీని నిలబెట్టుకున్నారు. బ్రిడ్జి నిర్మాణ జాప్యంతో ఇబ్బందులు పడుతున్న 3వ వార్డు ప్రజల సమస్యను గుర్తించిన ఆమె, కౌన్సిలర్ అజ్మీర వంశీ నాయక్ ఆధ్వర్యంలో జేసీబీలతో యుద్ధ ప్రాతిపదికన ఈ ప్రత్యామ్నాయ మార్గాన్ని సిద్ధం చేయించారు.

**అధికారం అంటే హోదా కాదు.. ప్రజల పట్ల బాధ్యత**

క్షేత్రస్థాయి పర్యటనే పరిష్కార మార్గం:రాజకీయ నాయకులు ఎన్నికలప్పుడు మాత్రమే కనిపిస్తారనే విమర్శలకు భిన్నంగా, వార్డు పర్యటనలో ప్రజల కష్టాలను స్వయంగా విన్న మున్సిపల్ చైర్‌పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, సమస్య తీవ్రతను గుర్తించి తక్షణ చర్యలకు ఉపక్రమించారు. ఎన్‌జీఓస్ కాలనీ వాగుపై బ్రిడ్జి నిర్మాణం జరుగుతున్నప్పటికీ, పనులు ఆలస్యం కావడంతో స్థానికులు పడుతున్న అవస్థలను చూసి ఆమె చలించిపోయారు. కేవలం హామీలకే పరిమితం కాకుండా, చేతల్లో చూపించడం గమనార్హం.

**యుద్ధ ప్రాతిపదికన తాత్కాలిక రహదారి:**

కౌన్సిలర్ అజ్మీర వంశీ నాయక్ సమన్వయంతో మున్సిపల్ యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి, ఈరోజు స్వయంగా క్షేత్రస్థాయిలో ఉండి పనులను పర్యవేక్షించారు. జేసీబీలతో వాగుపై రాకపోకలకు అనువైన మార్గాన్ని సుగమం చేయించి, వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో ప్రజలకు పెద్ద ఊరటనిచ్చారు. ఇది కేవలం ఒక రహదారి ఏర్పాటు మాత్రమే కాదు, ప్రజల ప్రాథమిక అవసరాల పట్ల పాలకులకు ఉండాల్సిన నిబద్ధతకు నిదర్శనం.

ప్రజాస్వామ్యంలో ప్రజావాణికి పట్టం: ఒక సామాన్యుడు తన సమస్యను విన్నవించుకున్నప్పుడు, అది ఎంత చిన్నదైనా పెద్దదైనా స్పందించే గుణమే నాయకత్వానికి అసలైన వన్నె తెస్తుంది. అధికారులకు తగిన సూచనలు ఇస్తూ, పనులు నాణ్యంగా జరిగేలా చూడటంలో ఆమె చూపిన చొరవను కాలనీ ప్రజలు ప్రశంసిస్తున్నారు.

"సమస్య మా దృష్టికి వస్తే, పరిష్కారం మార్గమే మా లక్ష్యం" అనే సంకేతాన్ని ఈ చర్య ద్వారా ఆమె పంపారు. అభివృద్ధి పనులు (బ్రిడ్జి నిర్మాణం) సాంకేతిక కారణాల వల్ల ఆలస్యం కావచ్చు, కానీ ఆ మధ్యకాలంలో సామాన్య ప్రజలు నరకం చూడకూడదు. ఈ చిన్న ప్రత్యామ్నాయ మార్గం ఇల్లందు మున్సిపాలిటీలోని ఇతర ప్రాంతాలకు కూడా ఒక రోల్ మోడల్. నిధుల కొరత లేదా పనుల జాప్యం అని సాకులు చెప్పకుండా, అందుబాటులో ఉన్న వనరులతో ప్రజల కష్టాలను ఎలా తీర్చవచ్చో ఈ సంఘటన నిరూపిస్తోంది. ఈ కార్యక్రమంలో 3వ వార్డు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ ముఖదం ప్రకాష్ తదితరులు పాల్గొని, ప్రజలకు అందుబాటులో ఉండి పనులను పూర్తి చేయించారు. స్థానిక ప్రజలు తమ సమస్యపై తక్షణమే స్పందించిన చైర్‌పర్సన్‌కు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నారు.

# బండి సంజయ్‌ను మంత్రి పదవి నుండి తొలగించాలి

◆ బీఆర్ఎస్ నేత దిండిగాల రాజేందర్ గర్జన

◆ చట్టం ముందు అందరూ సమానమే.. భగీరథపై పోక్సో కేసులో జాప్యం ఎందుకు?: దిండిగాల ప్రశ్న

ఇల్లందు మే 11 (జన సంఘర్షణ)

బీఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక సభ్యుడు దిండిగాల రాజేందర్ ఈరోజు ఇల్లందులో పార్టీ సమావేశం ఏర్పాటు చేసి, పోక్సో కేసు నమోదైన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరగాలంటే నిందితులు ఎంతటి వారైనా చట్టం తన పని తాను చేయాలని ఆయన స్పష్టం చేశారు.

నిగ్గుతేలాల్సిన నైతిక బాధ్యత: రాజకీయాల్లో వారసుల ప్రవర్తన తరచూ చర్చనీయాంశమవుతోంది. మైనర్ బాలికపై ఘాతుకానికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటూ, పోక్సో వంటి కఠినమైన చట్టం కింద కేసు నమోదైన వ్యక్తి ఇంకా బయట తిరగడం ప్రజాస్వామ్య వ్యవస్థకే సవాల్ అని దిండిగాల రాజేందర్ పేర్కొన్నారు. నిందితుడు కేంద్ర మంత్రి కుమారుడు కావడమే అరెస్టుకు అడ్డంకిగా మారిందా? అనే ప్రశ్నను ఆయన లేవనెత్తారు.

కేంద్ర మంత్రి పదవికి నైతికత ప్రశ్న: సమాజంలో మహిళల రక్షణ గురించి ప్రసంగించే కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, తన సొంత కుమారుడిపై ఇటువంటి తీవ్రమైన ఆరోపణలు వచ్చినప్పుడు ఆ పదవిలో కొనసాగే అర్హత కోల్పోయారని రాజేందర్ విమర్శించారు. నిష్పక్షపాతంగా విచారణ జరగాలంటే బండి సంజయ్‌ను వెంటనే మంత్రి పదవి నుంచి తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. అధికారంలో ఉన్నవారు చట్టానికి అతీతులు కారని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

ఇల్లందు నుంచి వినిపించిన నిరసన స్వరం: ఇల్లందు బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశం రాజకీయ వర్గాల్లో వేడిని పెంచింది. బాధితురాలికి అండగా నిలవాల్సిన బాధ్యత సమాజంపై ఉందని, ఇటువంటి కేసుల్లో రాజీ పడటం వల్ల నేరస్థులకు మరింత ధైర్యం వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో మౌనం వీడి, తక్షణ చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ శ్రేణులు డిమాండ్ చేస్తున్నాయి.

వ్యవస్థల నిష్పాక్షికతకు పరీక్ష: చట్టం ముందు అందరూ సమానమే అని చెప్పే పాలకులు, ఇలాంటి సున్నితమైన కేసులలో ఎలా వ్యవహరిస్తారన్నదే ఇప్పుడు ముఖ్యం. పోక్సో కేసు నమోదు కావడం అంటేనే దాని తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. నిందితులకు రాజకీయ రక్షణ కవచం ఉండకూడదని, పోలీసు యంత్రాంగం ఎవరి



ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిందితుడిని కటకటాల్లోకి నెట్టాలని రాజేందర్ కోరారు. ఒక సామాన్యుడిపై కేసు నమోదైతే స్పందించే తీరుకు, రాజకీయ నేతల కుటుంబ సభ్యులపై కేసు నమోదైతే స్పందించే తీరుకు మధ్య ఉన్న వ్యత్యాసం సమాజంలో అశాంతికి దారితీస్తోంది. చట్టం తన పని తాను చేయడమే కాకుండా, అది చేస్తున్నట్లు ప్రజలకు కనిపించాలి. బండి భగీరథ కేసులో జరుగుతున్న జాప్యం వ్యవస్థల విశ్వసనీయతను ప్రశ్నార్థకం చేస్తోంది. రాజకీయ లబ్ధి కంటే మహిళల భద్రత, చట్ట గౌరవం ముఖ్యమని ఈ నిరసన స్పష్టం చేస్తోంది.

# ఇల్లందులో క్షేత్రస్థాయి పరిశీలనతో లబ్ధిదారుల్లో కొత్త ఆశలు

- గడప గడపకు ఇందిరమ్మ రాజ్యం





ఇల్లందు మే 11 (జన సంఘర్షణ)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మున్సిపాలిటీలో ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన కార్యక్రమం కేవలం ఒక ప్రభుత్వ ప్రక్రియలా కాకుండా, సామాన్యుడి సొంతింటి కలను సాకారం చేసే ఒక యజ్ఞంలా సాగుతోంది. స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రత్యేక ఆదేశాలతో, మున్సిపల్ చైర్‌పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ నేరుగా ప్రజల వద్దకు వెళ్లి వారి సాధకబాధకాలను తెలుసుకోవడం రాజకీయాల్లో ఒక ఆరోగ్యకరమైన పరిణామం. ముఖ్యంగా 9వ, 11వ వార్డుల్లో ఆమె జరిపిన విస్తృత పర్యటన, నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాలకు తిరిగి జీవం పోసేలా కనిపిస్తోంది. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే కోరం కనకయ్యల సమన్వయంతో, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేయడమే లక్ష్యంగా సాగుతున్న ఈ కసరత్తు పాలనలో పారదర్శకతకు అద్దం పడుతోంది.

**క్షేత్రస్థాయిలో వాస్తవాల అన్వేషణ:**

నివేదికలు కాగితాల మీద అందంగా ఉండవచ్చు, కానీ వాస్తవ పరిస్థితులు గడప దాటితేనే తెలుస్తాయి. ఈ సూత్రాన్ని నమ్మిన చైర్‌పర్సన్ కిరణ్ మిత్ర డానియల్, స్వయంగా లబ్ధిదారుల ఇళ్లను సందర్శించి ఆర్థిక ఇబ్బందుల వల్ల ఆగిపోయిన పనులను పరిశీలించారు. ఏళ్ల తరబడి అసంపూర్తిగా ఉన్న గోడలు, పైకప్పు లేని గృహాలు ఆ కుటుంబాల వేదనకు సాక్ష్యాలుగా నిలిచాయి. ఆ బాధను స్వయంగా విని, ఎమ్మెల్యే ద్వారా మంత్రి దృష్టికి తీసుకెళ్తామని ఆమె ఇచ్చిన భరోసా బాధితులకు కొండంత అండగా మారింది.

**నాయకత్వ పటిమ - సమన్వయ కర్తగా ఎమ్మెల్యే:**

ఇల్లందులో ఏ పథకమైనా అర్హులకు అందాలనే పట్టుదలతో ఎమ్మెల్యే కోరం కనకయ్య పనిచేస్తున్నారు. నిరంతర పర్యవేక్షణ ఉంటేనే యంత్రాంగం వేగంగా కదులుతుందని ఆయన నమ్ముతున్నారు. 9వ వార్డులో గందె పద్మ, 11వ వార్డులో మొగిలి లక్ష్మీ వంటి కౌన్సిలర్లను సమన్వయం చేస్తూ, స్థానిక ఇందిరమ్మ కమిటీలను భాగస్వామ్యం చేయడం వల్ల రాజకీయాలకు అతీతంగా లబ్ధిదారుల ఎంపిక జరుగుతోందనే నమ్మకం ప్రజల్లో కలుగుతోంది.

**రాజకీయ నిబద్ధతకు నిదర్శనం:**

ఈ కార్యక్రమంలో కేవలం అధికారులు మాత్రమే కాకుండా, హరిహర క్షేత్రం టెంపుల్ చైర్మన్ గందె సదానందం, సీనియర్ నాయకులు బొల్ల సూర్యం వంటి అనుభవజ్ఞులు పాలుపంచుకోవడం విశేషం. ఇది ఒక వార్డు సమస్యగా కాకుండా, మొత్తం నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన అంశంగా పరిగణించబడుతోంది. మున్సిపల్ యంత్రాంగం మరియు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కలిసికట్టుగా పనిచేస్తుండటం వల్ల పథకం అమలులో వేగం పెరిగింది. ఒక సామాన్య కుటుంబానికి గూడు అనేది వారి జీవితకాల స్వప్నం. అది అసంపూర్తిగా మిగిలిపోయినప్పుడు కలిగే వేదన వర్ణనాతీతం. ఆ వేదనను గుర్తించి, అధికార యంత్రాంగమే స్వయంగా గడప ముందుకు వచ్చి సమస్యను నమోదు చేసుకోవడం అనేది 'ప్రజా పాలన'కు నిజమైన నిర్వచనం. ఎమ్మెల్యే కనకయ్య, మంత్రి పొంగులేటిల చొరవతో ఇల్లందులో ప్రతి గూడు ఒక సంపూర్ణ గృహంగా మారుతుందనే ఆశ ఇక్కడ స్పష్టంగా కనిపిస్తోంది. ఈ క్షేత్రస్థాయి పర్యటనలో కౌన్సిలర్లు జాఫర్, కార్తిక్ యాదవ్, అనేకమంది కార్యకర్తలు పాల్గొని, ప్రజల సమస్యల పరిష్కారమే పరమావధిగా కదిలారు. ఇలాంటి పర్యటనలు కొనసాగితేనే ప్రభుత్వ లక్ష్యాలు సఫలీకృతమవుతాయి.

# మారండి... సమాజానికి మంచి పౌరుడుగా ఎదగండి


- ఏ కష్టమొచ్చినా.. నేను అండగా ఉంటా
- గంజాయి, డ్రగ్స్ కు దూరంగా ఉండండి
- బెల్ట్ షాపుల ఆట కట్టిస్తా...
- పాత నేరస్తులకు కౌన్సిలింగ్ ఇచ్చిన జిల్లా ఎస్పీ
- పాత నేరస్తులపై ఎప్పుడు తన నిఘ ఉంటుంది
- జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర హెచ్చరిక



కామారెడ్డి/మే 11/(జన సంఘర్షణ)

ప్రవర్తనలో మార్పు తీసుకురండి.. సమాజానికి మంచి పౌరుడి ఎదిగండి అంటూ జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర వెల్లడించారు. సోమవారం సాయంత్రం జిల్లా ఎస్పీ కార్యాలయం ఆవరణలో కామారెడ్డి జిల్లా పాత నేరస్తులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. జిల్లా నుంచి వచ్చిన పాత నేరస్తులను ఒక్కొక్కరిని ప్రశ్నిస్తూ గ్రామాలలో ఎందుకు ప్రశాంతతకు భంగం కలిగిస్తున్నారని హెచ్చరించారు. ఒక్కసారి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయితే ఎప్పటికీ పోలీసుల నిఘా ఆ వ్యక్తిపై ఉంటుందని, ఆ వ్యక్తి తన ప్రవర్తనలో మార్పు తీసుకువచ్చే వరకు పోలీసులు నిఘ ఉంటుందని ఎస్పీ వెల్లడించారు. స్థానిక పోలీసులే కదా అని అనుకుంటే అది పొరపాటు తాను పాత నేరస్తులపై ఒక ప్రత్యేక నిఘా టీం ఏర్పాటు చేయడం జరిగిందని ఎప్పటికప్పుడు పాత నేరస్తులు ఏం చేస్తున్నారు, ఎక్కడ ఉంటున్నారు ఇంకా తప్పుడు మార్గంలో నడుస్తున్నారా అన్న విషయాలు ఎప్పటికప్పుడు తెలుసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర వెల్లడించారు. గంజాయి, పేకాట, డ్రగ్స్ కు దూరంగా ఉండాలని ఎస్పీ సూచించారు. పలువురి పాత నేరస్తులను మళ్లీ మళ్లీ గొడవలోకి వెళ్లడం వల్ల వారికి ఘాటుగా హెచ్చరించారు. మళ్లీ ఇలాంటి ఘటనలు తమ పోలీస్ శాఖ యాక్షన్ మరోరకంగా ఉంటుందని జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతంలో హోటల్లు, కిరాణా దుకాణాలలో బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారని కొంతమంది జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర దృష్టికి తీసుకురాగా, త్వరలో వాటిపై ఫోకస్ పెట్టమని ఎస్పీ వెల్లడించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో గొడవలు, హత్యలు, అత్యాచారాలు జరగడానికి కారణం మత్తు జిల్లా ఎస్పీ వెల్లడించారు. మద్యం మత్తులో ఎవరు ఏం చేస్తున్నారో తెలియని పరిస్థితి వస్తుందని మద్యానికి మత్తుకు దూరంగా ఉండాలని జిల్లా ఎస్పీ సూచించారు. మద్యం మత్తులో కుటుంబాలను చిన్నాభిన్నం అవుతున్నాయని ఎస్పి ఆవేదన వ్యక్తం చేశారు. కొంతమంది మద్యం మత్తులో భార్యాపిల్లల వేధింపులకు గురి చేయడమే కాకుండా, వారిని హత్యలకు పాల్పడుతున్నారని జిల్లా ఎస్పీ ఈ సందర్భంగా వెల్లడించారు. పాత నేరస్తులు తమ ప్రవర్తన మార్చుకుంటే వారిపై ఉన్న కేసులన్నీ తొలగిస్తానని ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ హామీ ఇచ్చారు. ఎవరైనా స్వయం ఉపాధి పథకాలు పెట్టుకోవడానికి ఆర్థిక స్తోమత లేకుంటే తన వంతుగా సహాయం అందిస్తానని భరోసా ఇచ్చారు. ఎవరైనా తమ పిల్లలు ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు సాధిస్తున్నాడంటే వారిపై ఉన్న కేసులను తొలగిస్తానని జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర హామీ ఇచ్చారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి ఏడు గంటల వరకు పాత నేరస్తులతో కౌన్సిలింగ్ నిర్వహించారు. కొందరికి ఘాటుగాని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీలు, డీఎస్పీలు, సిఐలు, ఎస్సైలు పోలీస్ లు పాల్గొన్నారు.

# మే 12న టీటీడీ స్థానిక ఆలయాల్లో వైభవంగా హనుమజ్జయంతి వేడుకలు



తిరుపతి/మే 11 /(జన సంఘర్షణ)

తిరుపతిలోని శ్రీ కోదండ రామస్వామివారి ఆలయం, శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయం, అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి ఆలయం, ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి ఆలయాలతో పాటు టీటీడీకి చెందిన ఇతర అనుబంధ ఆలయాల్లో మే 12న హనుమజ్జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. శరణాగత భక్తికి, అచంచల శ్రీరామ సేవకు ప్రతీకగా నిలిచిన శ్రీ ఆంజనేయస్వామివారి జయంతిని టీటీడీ ప్రతి సంవత్సరం భక్తిశ్రద్ధలతో నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, వాహనసేవలు నిర్వహించనున్నారు. తిరుపతిలోని శ్రీ కోదండరామస్వామివారి ఆలయానికి ఎదురుగా ఉన్న శ్రీ ఆంజనేయస్వామివారి ఆలయంలో మంగళవారం హనుమజ్జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించనున్నారు. ఉదయం 7 గంటల నుండి 9 గంటల వరకు శ్రీ ఆంజనేయస్వామి వారి మూలవర్లకు, శ్రీ సీతారామలక్ష్మణుల ఉత్సవర్లకు విశేష అభిషేకం నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుండి 8.30 గంటల వరకు హనుమంత వాహనసేవ భక్తులను ఆధ్యాత్మిక పరవశంలో ముంచెత్తనుంది. తిరుపతిలోని శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయానికి ఎదురుగా ఉన్న ఎదురు ఆంజనేయస్వామివారి ఆలయంలో ఉదయం 8 గంటల నుండి 8.30 గంటల వరకు శ్రీ ఆంజనేయస్వామివారి మూలవర్లకు ప్రత్యేక అభిషేకం నిర్వహించనున్నారు. అప్పలాయగుంటలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి ఆలయానికి ఎదురుగా ఉన్న శ్రీ ఆంజనేయస్వామివారి ఆలయంలో ఉదయం 8.30 గంటల నుండి 9.30 గంటల వరకు శ్రీ ఆంజనేయస్వామివారి మూలవర్లకు అభిషేకం నిర్వహించనున్నారు. ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామివారి ఆలయానికి ఎదురుగా ఉన్న శ్రీ ఆంజనేయస్వామివారి ఆలయంలో హనుమజ్జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఉదయం 7 గంటల నుండి 9 గంటల వరకు శ్రీ సంజీవరాయస్వామివారి మూలవర్లకు, శ్రీ సీతారామలక్ష్మణుల ఉత్సవర్లకు విశేష అభిషేకం నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుండి 8.30 గంటల వరకు హనుమంత వాహనసేవ వైభవంగా జరుగనుంది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని టీటీడీ కోరింది.

# అదిలాబాద్ వరుడు... లండన్ వధువు

- అంగరంగ వైభవంగా ఆదిలాబాద్లో పెళ్లి వేడుకలు



అదిలాబాద్/మే 11/(జన సంఘర్షణ)

దేశాలు వేరు, ప్రాంతాలు వేరు, కానీ వారిద్దరూ ఒకటయ్యారు.. ఒకరినొకరు ప్రేమించుకున్నారు. ఈ విషయాన్ని పెద్దల వరకు తీసుకువెళ్లారు. ఇరు కుటుంబాలు అంగీకరించడంతో ఆదిలాబాద్ వరుడు, లండన్ వధువుతో అంగరంగ వైభవంగా ఆదిలాబాద్లో సోమవారం పెళ్లి వేడుకలు జరిగాయి. ఇరు కుటుంబాలు అంగీకరించడంతో ఎంతో అంగరంగ వైభవంగా పెళ్లి జరిగింది. అదిలాబాద్ జిల్లా చెందిన సాయి చైతన్య పదేళ్ల క్రితం ఉన్నత చదువుల కోసం లండన్ వెళ్ళాడు. అక్కడనే స్థిరపడిపోయారు. లండన్‌కు చెందిన మీయాను అనే అమ్మాయితో ప్రేమ బంధం ఏర్పడింది. చివరికి వారిద్దరూ సోమవారం ఒకటయ్యారు. నూతన దంపతులను పెద్దలు ఆశీర్వదించండి.

# మైనర్ బాలికపై అత్యాచారం చేసి పోక్సో కేసులో నిందితుడైన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి కుమారుడు

బాన్సువాడ/మే 11/ (జన సంఘర్షణ) :




మైనర్ బాలికపై అత్యాచారం చేసి పోక్సో కేసులో నిందితుడైన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథపై చర్యలు తీసుకోవడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం అవలంబిస్తున్న తీరును నిరసిస్తూ.. పోతంగల్ మండల కేంద్రంలో 12-05-2026 నాడు ఉదయం 11:00 గంటలకు ప్రెస్ మీట్ కార్యక్రమం ఉంది. కావున పోతంగల్ మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమంనీ విజవంతం చేయగలరని కోరుతున్నాం.

# కోటగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం



కోటగిరి/, మే 11:/(జన సంఘర్షణ)

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 11 నుండి 15 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న విద్యా పక్షోత్సవాల్లో భాగంగా కోటగిరిలోని ప్రధానమంత్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 15 రోజుల వేసవి శిక్షణ శిబిరాన్ని సర్పంచ్ బర్ల మధుకర్ గారు సోమవారం ప్రారంభించారు. సర్పంచ్ మధుకర్ మాట్లాడుతూ: "వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేందుకు ప్రభుత్వం ఈ వేసవి శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేసింది. ప్రాథమిక గణితం, నృత్యం, సంగీతం, ఆటలు, చిత్రలేఖనం, చేతివ్రాత, కథ చెప్పడం, సృజనాత్మకత వంటి అంశాల్లో శిక్షణ ఇవ్వడం ద్వారా విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఈ శిబిరం దోహదపడుతుంది" అని అన్నారు. మండల అభివృద్ధి అధికారి జి. విష్ణు వివరాలు వెల్లడిస్తూ: "ఈ వేసవి శిక్షణ శిబిరం మే 11 నుండి 25 వరకు 15 రోజుల పాటు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు కొనసాగుతుంది. 6 నుండి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి" అని సూచించారు. మండల విద్యాశాఖాధికారి ఎన్. శ్రీనివాస రావు మాట్లాడుతూ: "ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఈ శిక్షణ ద్వారా విద్యార్థులు తమలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి, ఆసక్తి ఉన్న రంగాల్లో నైపుణ్యాలు పెంచుకోవాలి. ఇదే వేసవి శిక్షణ శిబిరం ప్రధాన ఉద్దేశం" అని తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు బి. సైలు, ఉపాధ్యాయులు గణేష్, అర్షద్, మల్లికార్జున్, అతీక్, విజయ్, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

# “బేటీ బచావో కాదు... బేటా బచావోగా మారింది బీజేపీ నినాదం”

**- మైనర్ బాలికపై హత్యాచారం చేసిన సాయి భగీరథ్ను వెంటనే అరెస్ట్ చేయాలి.**

**- బండి సంజయ్ను మంత్రి పదవి నుండి బర్తరఫ్ చేయాలి**

**- బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు కొరిపెల్లి నిర్మల**






**పీర్జాదిగూడ :**
మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ సర్కిల్ పీర్జాదిగూడ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు సాయి భగీరథ్పై నమోదైన పోక్సో కేసు వ్యవహారంపై బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ కార్పొరేటర్లు, నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు కొరిపెల్లి నిర్మల మాట్లాడుతూ... “బేటీ బచావో” అంటూ దేశవ్యాప్తంగా నినాదాలు ఇచ్చే బీజేపీ, ఇప్పుడు “బేటా బచావో” విధానాన్ని అమలు చేస్తోందని తీవ్రంగా విమర్శించారు. మైనర్ బాలికపై అత్యాచారం కేసులో పోక్సో చట్టం కింద కేసు నమోదైనప్పటికీ, నిందితుడు సాయి భగీరథ్ను ఇప్పటివరకు అరెస్ట్ చేయకపోవడం రాష్ట్ర ప్రజల్లో తీవ్ర ఆగ్రహానికి కారణమైందన్నారు. చట్టం అందరికీ సమానమైతే అధికార పార్టీల నేతల కుటుంబాలకు మాత్రం ఎందుకు మినహాయింపు ఇస్తున్నారో ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని, న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు.మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి మాట్లాడుతూ... దేశం కోసం, ధర్మం కోసం అంటూ పెద్ద పెద్ద మాటలు చెప్పే బండి సంజయ్, ఇప్పుడు తన కుమారుడిని కాపాడేందుకు అధికారాన్ని ఉపయోగిస్తున్నారని ప్రజలు భావిస్తున్నారన్నారు. “బేటీ బచావో” నినాదాన్ని “బేటా బచావో”గా మార్చినట్టుగా పరిస్థితి కనిపిస్తోందన్నారు. బాధితురాలి 164 CrPC స్టేట్మెంట్ ఇప్పటివరకు నమోదు చేయకపోవడం కూడా చట్టపరమైన నిర్లక్ష్యమేనని ఆరోపించారు. రాష్ట్ర డీజీపీ స్థాయి మహిళా అధికారుల ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (SIT) ఏర్పాటు చేసి, హైకోర్టు పర్యవేక్షణలో విచారణ జరపాలని డిమాండ్ చేశారు.మాజీ కార్పొరేటర్ కొల్తూరి మహేష్ మాట్లాడుతూ... బాధిత కుటుంబం ఇచ్చిన ఫిర్యాదును పోలీసులు గంటల తరబడి స్వీకరించకపోవడం, ఫిర్యాదును మార్చమని ఒత్తిడి తేవడం, కేసు వెనుక పెద్దలు ఉన్నారని చెప్పడం వంటి ఆరోపణలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. న్యాయం కోసం బాధిత కుటుంబం పోలీస్ స్టేషన్ ముందు వేడుకోవాల్సిన పరిస్థితి రావడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు.సీనియర్ నాయకులు లేతాకుల రఘుపతి రెడ్డి మాట్లాడుతూ... ప్రధానమంత్రి సభలో ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించిన తర్వాతే ఫిర్యాదు స్వీకరించడం దురదృష్టకరమన్నారు. పోక్సో చట్టం ప్రకారం మైనర్ బాలిక సమ్మతి చెల్లదని, అయినప్పటికీ నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోకుండా బాధితురాలిపైనే కేసులు నమోదు చేయడం దారుణమన్నారు. బాధిత కుటుంబాన్ని బెదిరించే ప్రయత్నాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.మాజీ కార్పొరేటర్ కొడే పోచయ్య మాట్లాడుతూ... ఈ కేసులో పేట్ బషీరాబాద్ పోలీసుల పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. నిందితుడికి సహకరించిన అధికారులను వెంటనే సస్పెండ్ చేసి, వారి కాల్ డేటాను విచారించాలని కోరారు. అలాగే కేంద్ర మంత్రి బండి సంజయ్ నివాసంలోని సీసీటీవీ ఫుటేజీని స్వాధీనం చేసుకుని నిజాలను వెలికితీయాలని డిమాండ్ చేశారు.బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ... ఈ కేసును మీడియా దృష్టికి రాకుండా దాచిపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమన్నారు. “హనీ ట్రాప్” పేరుతో అసలు అంశాన్ని మళ్లించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, మహిళల భద్రతపై మాట్లాడే నాయకులు ఇప్పుడు ఎందుకు మౌనం పాటిస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్ రాజకీయ ప్రయోజనాల కోసం కేసును బలహీనపరిచే ప్రయత్నం చేస్తున్నారనే అనుమానాలు ప్రజల్లో పెరుగుతున్నాయన్నారు. నిందితుడిని వెంటనే అరెస్ట్ చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు మనోరంజన్ రెడ్డి,నాయకులు ఆకుల మధుకర్,కందుకూరి ఆంజనేయులు,గడీల జగన్ రెడ్డి,శ్యామల శ్రీనివాస్,పాశం నరేందర్ రెడ్డి, పుల్ల శ్రీనివాస్, బుల్లెట్ శంకర్,నర్సిరెడ్డి, కళ్యాణి,లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## చిలుకనగర్ ప్రభుత్వ పాఠశాల ప్రతిభావంతుల విద్యార్థులకు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అభినందనలు





**ఉప్పల్ :**
చిలుకనగర్ ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అభినందించారు. చిలుకనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్, బీఆర్ఎస్ నాయకులతో కలిసి పాఠశాలను సందర్శించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులను శాలువాలతో సత్కరించి మిఠాయిలు తినిపించా రు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించడం అభినంద నీయమన్నారు. విద్యార్థులు మంచి మార్కులు సాధించడంలో కృషి చేసిన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అంజిరెడ్డి, ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో ఎలాంటి రాజీ ఉండదని, పాఠశాలకు అవసరమైన అన్ని పనులను చేపడతామని తెలిపారు.నూతన భవన నిర్మాణ పనులకు కూడా త్వరలోనే అనుమతులు తీసుకువచ్చి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.మాజీ కార్పొరేటర్ గీతా ప్రవీణ్ ముదిరాజ్ మాట్లాడుతూ విద్యార్థుల మెరుగైన ఫలితాల కోసం ప్రధానోపాధ్యాయుడు అంజిరెడ్డి, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధతో కృషి చేశారని ప్రశంసించారు. గత ఏడాదికంటే ఈ ఏడాది మెరుగైన ఫలితాలు రావడం ఆనందకరమన్నారు. విద్యార్థులు ఇంటర్లో కూడా ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కోహెడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ‘ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక’: డిజిటల్ క్లాసులు ప్రారంభం



**సిద్దిపేట :**
సిద్దిపేట జిల్లా కోహెడ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ‘ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక’ కార్యక్రమంలో భాగంగా పలు అభివృద్ధి మరియు అభినందన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన డిజిటల్ క్లాసులను స్థానిక సర్పంచ్ బందెల సుజాత బాలకిషన్ ప్రారంభించారు.రాష్ట్ర స్థాయి ర్యాంకర్ ఇ. ప్రదీప్కు సన్మానం ఇటీవల విడుదలైన పరీక్ష ఫలితాలలో అద్భుత ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. ముఖ్యంగా 490/500 మార్కులు సాధించి, రాష్ట్ర స్థాయిలో ర్యాంకు కైవసం చేసుకున్న విద్యార్థి ఇ. ప్రదీప్ను సర్పంచ్ మరియు కళాశాల బృందం ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు.జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం కళాశాలను జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలపడానికి కృషి చేసిన అధ్యాపక బృందాన్ని సర్పంచ్ కొనియాడారు. ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని, విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి







**ఉప్పల్ :**
లచిల్కానగర్, బీరప్పగడ్డ డివిజన్లలో రూ.1 కోటి 48 లక్షల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. మాజీ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ స్థాయీ సంఘ సభ్యురాలు బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్తో కలిసి పలు కాలనీలు, బస్తీలలో సీసీ రహదారులు, వర్షపు నీటి కాలువల పైప్లైన్లు, మురుగునీటి పైప్లైన్ల పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ చిల్కానగర్ డివిజన్ అభివృద్ధికి రూ.1.48 కోట్లతో పనులు చేపట్టినట్లు తెలిపారు. భూగర్భ మురుగునీటి పైప్లైన్లు, వర్షపు నీటి పారుదల కాలువలు, సీసీ రహదారుల నిర్మాణాన్ని దశలవారీగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు. డివిజన్ అభివృద్ధికి మాజీ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నారని అభినందించారు.మాజీ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ మాట్లాడుతూ బ్యాంక్ కాలనీలో ఆటో నిలయం నుంచి ఫణి ఔషధ దుకాణం వరకు వర్షపు నీటి కాలువ పైప్లైన్, ఆటో నిలయం నుంచి వార్డు కార్యాలయం వరకు సీసీ రహదారి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. సాయిరాం నగర్, కళ్యాణ్పురి ప్రాంతాల్లో మురుగునీటి పైప్లైన్ పనులు ప్రారంభించినట్లు చెప్పారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అభివృద్ధి పనుల రూపంలో అమలు చేస్తున్నామని, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతిపాదనలను దశలవారీగా పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్,పసుల ప్రభాకర్ రెడ్డి,ఎద్దుల కొండల్ రెడ్డి, కొక్కొండ జగన్, వి.బి. నరసింహ, జల్లి మోహన్, బాలకృష్ణ గౌడ్, ముద్దం శ్రీనివాస్ యాదవ్ తదితరులు, కాలనీ సంక్షేమ సంఘాల సభ్యులు, మహిళలు, బస్తీవాసులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం మాది.. అభివృద్ధి చేసే బాధ్యత మాది..!

- **నిధుల మంజూరు,అభివృద్ధి పనులపై తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దు**
- **ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జీ మందుముల పరమేశ్వర్రెడ్డి**
- **ఉప్పల్,ఈసీఐఎల్ ప్రాంతాలలో సీఎం రేవంత్రెడ్డి చిత్ర పటాలకు పాలాభిషేకం**



**ఉప్పల్**
రాష్ట్రంలో సీఎం రేవంత్రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం నడుస్తుందని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ బాధ్యుడు మందుముల పరమేశ్వర్రెడ్డి పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వంలో ఉప్పల్ నియోజకవర్గానికి రూ.కోట్లాది నిధులను తెస్తూ అభివృద్ధి పనులను చేపడుతున్నట్టుగా చెప్పారు.ఉప్పల్ నియోజకవర్గంలోని ఉప్పల్, కుషాయిగూడ జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలు అప్గ్రేడేషన్ కోసం రూ.37.10 కోట్ల నిధులను మంజూరు చేయించినట్టుగా చెప్పారు. సీఎం రేవంత్రెడ్డి ప్రత్యేక చొరవతోనే ఇది సాధ్యం అయిందన్నారు.దీంతోనే కృతజ్ఞతగా సీఎం రేవంత్రెడ్డి గారి చిత్ర పటాలకు పాలాభిషేకం చేసినట్టుగా చెప్పారు. ఉప్పల్,ఈసీఐఎల్ ప్రాంతాలలో సీఎం రేవంత్రెడ్డి చిత్ర పటానికి కాంగ్రెస్ నాయకులు సోమవారం పాలాభిషేకం చేపట్టారు. రెండు ప్రాంతాలలో జరిగిన పాలాభిషేక కార్యక్రమానికి పరమేశ్వర్రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.ఎంత ప్రచారం చేసుకున్నా, ఎన్ని రకాల మాయమాటలు చెప్పిన ప్రజలు కాంగ్రెస్ పార్టీని, సీఎం రేవంత్రెడ్డినే నమ్ముతారని ఈ సందర్భంగా పరమేశ్వర్రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులు కావాలన్నా, స్థానిక సమస్యల పరిష్కారం కావాలన్నా నేరు నన్ను లేదా మా పార్టీ డివిజన్ అధ్యక్షులను కలిసి పరిష్కరించుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి,సింగిరెడ్డి ధన్పాల్ రెడ్డి,పావని రెడ్డి,స్వర్ణరాజ్ శివమణి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొత్త అంజి రెడ్డి,సీత రామ్ రెడ్డి,రాజేందర్,కాప్రా,చెర్లపల్లి ,మల్లాపూర్, ఏఎస్ రావు నగర్,మీర్పేట్,హెచ్ బీ కాలనీ అధ్యక్షులు నాగ శేషు,కాశెట్టి ప్రసాద్, పోలేపక అంజయ్య,కప్రా సాయి గౌడ్,వెంకట్ రెడ్డి జిల్లాకార్యవర్గ సభ్యులు దండల్లా మురళి,సురేష్, పాకాల రాజు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ నాయక్,పూర్ణ యాదవ్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు,

# తెలంగాణ అస్తిత్వానికి ప్రతీక జన సమితి . మే 12న జన సమితి ప్లీనరీ

దశాబ్దల కాలం పాటు సాగిన తెలంగాణ పోరాటం ఆత్మగౌరవ పోరాటం.. సీమాంధ్ర ఆధిపత్యశక్తుల దోపిడీకి వ్యతిరేకంగా ఈ ప్రాంత అస్థితానికి మూల స్తంభమైన వనరులను కాపాడేందుకు సకలజనులను ఏకం చేసి తెలంగాణ ప్రజల అస్తిత్వానికి, ఆత్మగౌరవానికి ప్రత్యేకగా నిలిచిన ఉద్యమం తెలంగాణ ఉద్యమం. ప్రజలందరి ఐక్య పోరాటాల ఫలితంగా అమరుల బలిదానాల సాక్షిగా ఏర్పడిన తెలంగాణలో ఉద్యమ ఆకాంక్షలు అడుగంటిపోయాయి .రాజ్యాంగ విలువలకు కిలోదకాలు ఇస్తూ, ప్రజాస్వామ్యాన్ని అపహస్యం చేశారు .2014 రాష్ట్ర ఆవిర్భావం తర్వాత అధికారంలోకి వచ్చిన పార్టీ ఒక కుటుంబ పాలనగా, నిరంకుశంగా పరిపాలిస్తూ తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను సాధించడంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడంలో విఫలమైంది. ఈ నేపథ్యంలో తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడటానికి తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను సాధించడానికి ,ప్రజాస్వామ్య తెలంగాణను నిర్మించడానికి, ఆనాటి కుటుంబ పాలనను గద్దించటానికి ఒక రాజకీయ వేదిక అనివార్యమైంది. ఈ నేపథ్యంలో నాటి తెలంగాణ ఉద్యమకారులు, ప్రజాస్వామ్యవాదులు, రాజకీయ జేఏసీ చైర్మన్గా ఉన్న కోదండరాం మాత్రమే ఈ తెలంగాణ అస్తిత్వానికి ప్రత్యేకంగా నిలబడగలడని విశ్వసించారు. రాజకీయ పార్టీ ద్వారానే అది సాధ్యమవుతుందని ఆలోచించి ఏదో మదనం జరిపిన అనంతరం 2018లో ఏప్రిల్ 29న తెలంగాణ జన సమితికి అంకురార్పణ చేశారు.తెలంగాణ అస్తిత్వానికి, ఉద్యమ ఆకాంక్షల వేదికగా తెలంగాణ జన సమితి ఆనాటి ఉద్యమ రథసారథి, సకలజనుల సేనాని, రాజకీయ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం గారి నేతృత్వంలో ఆవిర్భవించింది. ఉద్యమ సంస్థగా ,ఉద్యమ పార్టీగా చెప్పుకుంటూ వచ్చిన టిఆర్ఎస్ పార్టీ అనంతరం భారత రాష్ట్ర సమితిగా మారిపోయింది. తెలంగాణ రాష్ట్రంలో టిఆర్ఎస్ తో పాటు కాంగ్రెస్ బిజెపి వంటి జాతీయ పార్టీలు మాత్రమే ఉనికిలో ఉండి రాజకీయాలను శాసిస్తున్నాయి. ఇలాంటి సమయంలో ఉద్యమ ఆకాంక్షలను నెరవేర్చడానికి, తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడటానికి తెలంగాణ పేరుతో తెలంగాణ జన సమితి ఏర్పాటు అనివార్యమైంది. తెలంగాణ జన సమితి ఆవిర్భావం నాటి నుంచి నేటి వరకు ఎన్నో పోరాటాలను ప్రత్యక్షంగా చేయడంతో పాటు ప్రజల మధ్య అనునిత్యం ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కృషి చేసింది. నాటి టిఆర్ఎస్ ప్రభుత్వం సీమాంధ్ర పాలన విధానాలనే కొనసాగిస్తూ కాంట్రాక్టులు, కమిషన్లు ,నోట్లు ఓట్లు, సీట్లు కేంద్రంగా పాలన సాగిస్తున్న ఈ సమయంలో రాజకీయ మార్పు కోసం ప్రత్యామ్నాయ రాజకీయాలను తెరపైకి తీసుకువచ్చింది.. డబ్బులేని రాజకీయాలను, ప్రజాస్వామ్య బద్ధంగా నిర్వహించాలని సూచించింది. రాజకీయాలు ఖరీదైన వ్యాపారం అనే భావనను చరదీసి సామాన్యులకు రాజకీయాల్లో స్థానం



కల్పించాలనే లక్ష్యంతో జన సమితి పలు స్థాయిలో పోరాటం కొనసాగిస్తుంది.

పార్టీ ఆవిర్భావం నాటి నుంచి నిరుద్యోగ సమస్యలను తెరమీదకి తీసుకొచ్చి కొలువులకై కొట్లాట ఉద్యమాన్ని చేపట్టింది. గోదావరి పరివాహక ప్రాంతంలో పోడు భూముల కోసం సాగిన ఆదివాసి ఉద్యమాలకు అండగా నిలిచింది. ఆర్టీసీ కార్మికులు కొనసాగించిన సమ్మెకు మద్దతు పలికింది. ధర్నా చౌక్ నిషేధంపై ప్రత్యక్ష పోరాటంతో పాటు న్యాయస్థానాల్లో పార్టీ తరపున కేసు వేసి తిరిగి ప్రజాస్వామ్యాన్ని, స్వేచ్ఛను కాపాడే విధంగా ఇందిరా పార్క్ ధర్నా చౌక్ లో ధర్నాలు చేసుకోవడానికి కృషి చేసింది.. రైతులకు గిట్టుబాటు ధర కోసం, కూలీల సమాన పనికి సమాన వేతనం కోసం, కృష్ణా జలాల పరిరక్షణ కోసం, అలుపెరుగని పోరాటాలను నిర్వహించింది. కెసిఆర్ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రజలను ప్రజాస్వామిక వాదులను మేధావులను ఐక్యం చేయడంలో కీలకపాత్ర పోషించింది. తెలంగాణ ఉద్యమ సమయంలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను తెరమీదకి తీసుకురావడంలో జన సమితి కీలక పాత్ర పోషించింది. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలోతెలంగాణ ఉద్యమకారుల పలు హామీలను పెట్టించడంలో తన వంతు పాత్రను నెరవేర్చింది. కెసిఆర్ నిరంకుశ పాలనను అంతం చేయడానికి కాంగ్రెస్ పార్టీకి గత ఎన్నికలలో మద్దతు ఇచ్చి ప్రజా పాలనలో భాగస్వాములు అయింది. 2023 రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజా పాలన సాగించడానికి, ఎన్నికల ప్రచారంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి ఉద్యోగ ,ఉపాధ్యాయ ,నిరుద్యోగ, రైతులు ,కార్మిక,కర్షకుల సమస్యలను పరిశీలించడానికి తనదైన శైలిలో కోదండరాం ప్రయత్నం ముమ్మరంగా సాగుతుంది.ప్రస్తుత తెలంగాణ రాష్ట్రంలో ఉన్న అన్ని రాజకీయ పార్టీలలో ఒక్కొక్కరిది ఒక విధానం. తెలంగాణ పోరాటం, ఉద్యమ ఆకాంక్షలు ,తెలంగాణ అస్తిత్వం అనే నినాదాలతో ముందుకు సాగుతున్న ఏకైక తెలంగాణ పార్టీ తెలంగాణ జన సమితి. ఈ నేపథ్యంలో తెలంగాణ జన సమితి ఆవిర్భవించి ఎనిమిది సంవత్సరాలు పూర్తి చేసుకుని తొమ్మిదవ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న ఈ నేపథ్యంలో మే 12న పార్టీ నాల్గవ ప్లీనరీ సమావేశాలను హైదరాబాదులోని జలవిహార్ లో ఘనంగా నిర్వహిస్తుంది. ఈ సమావేశాలకు రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ జన సమితి శ్రేణులతో పాటు తెలంగాణ ఉద్యమకారులు ప్రజాసంఘాల నాయకులు మేధావులు హాజరై పలు అంశాలపై చర్చించనున్నారు. ప్లీనరీ సమావేశాలకు హైదరాబాద్ నెక్లెస్ రోడ్ లోని జలవిహారులు ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సమయానికి ముందు కళాకారులు ఉద్యమకారులు పార్టీ రాష్ట్ర అధ్యక్షులు శాసనమండలి సభ్యులు ప్రొఫెసర్ కోదండరాం గారికి ఘన స్వాగతం పలకడానికి భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. సమావేశాలకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

**ఇట్లు**

**ఎం నర్సయ్య**

**తెలంగాణ జన సమితి**

**గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ప్లీనరీ నిర్వహణ కమిటీ కన్వీనర్**

## నాలుగు లేబరుకోడ్స్ ను రద్దు చేయాలి

**రామగుండం,మే 11**



సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూని యన్ (సిఐటియూ) ఆధ్వర్యంలో ఆర్జి-1ఏరి యాలో 4 లేబరుకోడ్స్ ను రద్దుచేయాలని కేంద్రప్రభుత్వం జారీచేసిన జి ఓ కాపీలను దగ్ధం చేయడం జరిగింది.ఈ సందర్భంగా సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మేదరి సారయ్య మాట్లాడుతూ 4 లేబరుకోడ్స్ వలన కార్మికులను పెట్టుబడిదారులకు కట్టు బానిసలుగా మార్చేవిదంగా ఉన్నాయని కార్మికులు తమ హక్కుల కోసం పోరాడే అవకాశం లేకుండా సమ్మె చేసే హక్కు,వేతన ఒప్పందం హక్కు, బోనస్ హక్కు చాట్టాలను స్వాతంత్ర్య ముకు ముందు పోరాడి సాదించుకున్న హక్కులను లేకుండా కేంద్రప్రభుత్వం ఈ కోడ్స్ ద్వారా లేకుండా చేస్తుందని, ఇప్పటికే కొలిండియాలో వేజ్ బోర్డ్ కమిటీ వేయాల్సి ఉండగా వేయలేదని జులై 1 నుండి అమలు కావలసిన ఉందని,4 లేబరుకోడ్స్ కు వ్యతిరేకంగా దేశంలో పెద్దఎత్తున కార్మికులు నిరసన పోరాటాలు చేస్తున్నారని తెలిపారు.ఇటీవల జరిగిన 5 రాష్ట్రాల ఎన్నికల్లో బిజెపి 3 రాష్ట్రాలలో ధికారంలోకి వచ్చాక 4 లేబరుకోడ్స్ ను పూర్తి స్థాయిలలో అమలు చేయుటకు దూకుడుగా ముందుకు పోతుందని,రాబోవు రోజుల్లో కార్మిక సంఘాలు కార్మికవర్గం ఏకమై నిరవధిక సమ్మెలు సైతం చేయుటకు వెనుకాడ బోమని హెచ్చరించారు.ఈ కార్యక్ర మంలోపెద్దపల్లి శేషికిరణ్,ఈ.సాగర్,టి.నరహరి, సాగర్,జెనార్ధన్,వై.శ్రీనివాస్, ఇ.సురేష్, రాజేందర్,శరత్,నవీన్,సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి:



**చిట్యాల, మే 11**

చిట్యాల మండల పరిధిలోని పెద్ద కాపర్తి వద్ద జరిగిన రోడ్డు ప్రమా దంలో ఒకరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చౌటుప్పల్ మండలం తాళ్లసింగా రానికి చెందిన బాతరాజు గణేష్ (52) ఆదివారం రాత్రి పెద్దకాపర్తిలో ఒక ఫంక్షన్కు హాజరై తన స్కూటీపై తిరిగి వస్తుండగా, భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో ఎదురుగా అతివేగంగా వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గణేష్ను తొలుత నార్కెట్పల్లి కామినేని ఆసుపత్రికి తరలిం చారు. ఆపై పరిస్థితి విషమించడంతో హైదరాబాద్కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. మృతుని అన్న కుమారుడు బాతరాజు శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు.

## ఎండల తీవ్రత పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి డాక్టర్ మనోజ్...

**అన్నపురెడ్డిపల్లి/ప్రజావారధి:**

ప్రస్తుతం పెరుగుతున్న ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలు వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నపురెడ్డిపల్లి మండల వైద్యులు డాక్టర్ మనోజ్ సూచించారు. వడదెబ్బ అనేది ప్రాణాపాయానికి దారితీసే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ నివారణ చర్యలు పాటించాలని ఆయన కోరారు. శరీర ఉష్ణోగ్రత అకస్మాత్తుగా పెరగడం వడదెబ్బకు ప్రధాన సంకేతం అన్నారు. తీవ్రమైన తలనొప్పి కళ్ళు తిరగడం. శరీర ఉష్ణోగ్రత పెరిగినా చెమట పట్టకపోవడం. చర్మం ఎర్రగా మారి పొడిబారిపోవడం. వాంతులు లేదా వికారం కలిగినట్లు ఉండటం. కండరాల బలహీనత లేదా నొప్పులు. తీవ్రత ఎక్కువగా ఉంటే స్పృహ కోల్పోవడం. దాహం వేయక పోయినా తరచుగా నీరు, మజ్జిగ, కొబ్బరి నీళ్లు, ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవాలి. ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఎండలో తిరగకపోవడం మంచిది. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్తే గొడుగు, తలకు టోపీ లేదా తలకు రుమాలు ధరించాలి అన్నారు. వదులుగా ఉండే కాటన్ (నూలు) దుస్తులు ధరించాలి. ఇవి చెమటను పీల్చుకుని శరీరాన్ని చల్లగా ఉంచుతాయి అన్నారు. నూనె



వస్తువులు, మసాలా దట్టించిన ఆహారం తగ్గించి, పండ్లు ద్రవ పదార్థాలకు ప్రాధాన్యత ఇవ్వాలి అన్నారు. చిన్న పిల్లలు, గర్భిణీలు వృద్ధులు ఎండ తీవ్రతకు త్వరగా ప్రభావితం అవుతారు కాబట్టి వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి అన్నారు. బాధితుడిని వెంటనే నీడ ఉన్న చల్లని ప్రదేశానికి చేర్చాలి అన్నారు. తడి గుడ్డ తో శరీరాన్ని తుడుస్తూ ఉష్ణోగ్రత తగ్గించే ప్రయత్నం చేయాలి అన్నారు. స్పృహలో ఉన్నట్లయితే ధారాళంగా నీరు లేదా ఓఆర్ఎస్ తాగించాలి అన్నారు. పరిస్థితి విషమించక ముందే సమీపం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి లేదా ఆసుపత్రికి తరలించాలి అన్నారు. ప్రజలు నిర్లక్ష్యం చేయకుండా ఆరోగ్య సూత్రాలు పాటిస్తే వడదెబ్బ నుండి మనల్ని మనం రక్షించుకోవచ్చు అన్నారు. ఎర్రగుంట వైద్య ఆరోగ్య కేంద్రంలో వడదెబ్బ బాధితులకు అవసరమైన మందులు, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు అందుబాటు లో ఉన్నాయి అన్నారు.

## మడుగులపల్లి మండలంలో జనాభా లెక్కల ప్రక్రియ ప్రారంభం

**ప్రజలు ఖచ్చితమైన వివరాలు అందించి సహకరించాలి**

**తాసిల్దార్ సామల సరోజ పావని**

**మడుగులపల్లి:**

మండల కేంద్రంలో జనాభా గణన (సర్వే) ప్రక్రియను తాసిల్దార్ సామల సరోజ పావని సోమవారం అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని పలు ఇళ్లను ఆమె స్వయంగా సందర్శించి, కుటుంబ సభ్యుల వివరాలను అడిగి తెలుసుకున్నారు ఎన్యూమరేటర్లు నమోదు చేస్తున్న తీరును పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు,అనంతరం తాసిల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని ప్రతి ఇంటిని సందర్శించి పారదర్శకంగా వివరాలు సేకరించాలని సిబ్బందిని ఆదేశించారు ప్రజలు తమ వద్దకు వచ్చే ఎన్యూమరేటర్లకు కుటుంబ సభ్యుల సంఖ్య, ఆధార్, విద్యార్హతలు ఇతర సామాజిక, ఆర్థిక వివరాలను నిక్కచ్చిగా తెలపాలని కోరారు ఈ గణాంకాల



ఆధారంగానే భవిష్యత్తులో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు మౌలిక సదుపాయాల కల్పన జరుగుతుందని ఆమె వివరించారు,నిర్దేశించిన సమయంలోగా సర్వే పూర్తి చేయాలని, వివరాల నమోదులో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకూడదని అధికారులకు సూచించారు ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారి శ్రీనివాస్, సతీష్ కుమార్ఎన్యూమరేటర్లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

Printed, published and owned by Rachamallu Madhavi Printed at Kranthi Printing Press, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : Rachamallu Madhavi. RNI Reg No :tel/2024/89323, Cell 6305026524, Email:janasangarshana@gmail.co